



తీర్పు నేడే

- నిరీక్షణకు తెర

- అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే
- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- తొలుత పోస్టల్ బ్యాలెట్లు, ఆపై ఈవీఎంలు
- బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్.



కౌంటింగ్ కేంద్రాలలోని ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా.

ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి వచ్చింది.. దాదాపు మూడు నెలల పాటు సాగిన ఓట్ల సమరం మంగళవారం నాటి ఓట్ల లెక్కింపుతో ముగింపునకు రానుంది. మే 13న పోలింగ్ ముగియడంతో అప్పటినుంచి అభ్యర్థులతో పాటు ప్రజలు ఫలితాలపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. రకరకాల సర్వేలు, అంచనాలు, ఊహాగానాలు, సామాజిక సమీకరణాలు, కూడికలు, తీసివేతలు ఇలాంటి వాటన్నింటికి తెరపడి వాస్తవ ఫలితాలు మరికొద్ది గంటల్లోనే రానున్నాయి. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు బాపట్ల పార్లమెంటు స్థానానికి సంబంధించిన కౌంటింగ్ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.



రథం బజారు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పోస్టల్ బ్యాలెట్ ఇలా..

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్లు	పోలైనవి
వేమూరు	2076	1981
రేపల్లె	3818	3582
బాపట్ల	2899	2719
పర్చూరు	2920	2766
అద్దంకి	2821	2702
చీరాల	3271	3017
మొత్తం	17,805	16,767

బాపట్ల, జూన్3(ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల భవితవ్యం తేలిపోయే సమయం వచ్చేసింది. ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓటరు తీర్పు నేడు వెలువడనుంది. ఓటర్ల తీర్పు కోసం అభ్యర్థులు ప్రజలు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపును పూర్తి చేసేందుకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. మే 13న పోలింగ్ ముగిశాక పోస్టల్ బ్యాలెట్లను ఆయా నియోజకవర్గాల్లోని ఆర్వో కేంద్రాల్లో భద్రపరిచారు. వీటిని పూర్తి భద్రత మధ్య సోమవారం బాపట్లలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. ఈ దఫా ప్రధాన రాజకీయ పార్టీల దృష్టంతా పోస్టల్ బ్యాలెట్లపైనే ఉంది.

పోలింగ్ కేంద్రాలు.. రౌండ్లు వారీగా....

ఈవీఎంల కౌంటింగ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానుంది. ఒక్కో రౌండ్‌కు సంబంధించి 14 బూత్‌ల ఓట్లను లెక్కించనున్నారు. 298 పోలింగ్ స్టేషన్లతో అద్దంకి నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలవగా ఇక్కడ 22 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. తర్వాత 295 పోలింగ్ బూత్‌లతో పర్చూరు ఉండగా ఇక్కడా 22 రౌండ్లలో లెక్కింపు సాగనుంది. రేపల్లెలో 264 పోలింగ్ స్టేషన్లకు 19 రౌండ్లు, వేమూరులో 233 కేంద్రాల పరిధిలో 17 రౌండ్లు, చీరాలలో 218 పోలింగ్ స్టేషన్లు ఉండగా 16 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. బాపట్ల నియోజకవర్గంలో 202 పోలింగ్ కేంద్రాలకు 15 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. జిల్లాలో తొలి ఫలితం వెల్లడి కూడా బాపట్లదే కానుంది.

పోలీస్ నిఘాలో బాపట్ల

కౌంటింగ్ జరిగే బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల పరిసరాలతో పాటు బాపట్ల పట్టణం మొత్తం పోలీసు నిఘాలోకి వెళ్లింది. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉండడంతో అనుమతి లేకుండా ఎలాంటి విజయోత్సవాలు, ర్యాలీలు చేపట్టరాదని ఇప్పటికే పోలీసు శాఖ ఆదేశించింది. బాపట్ల పట్టణంలోకి ప్రవేశించే బైపాస్ మార్గాల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేసిన తర్వాతనే అనుమతిస్తున్నారు. సహేతుక కారణం లేకుండా బయట వ్యక్తులు ఎవ్వరినీ పట్టణంలోకి ప్రవేశించనీయడం లేదు. కౌంటింగ్ కేంద్రం దగ్గర మూడంచెల భద్రత ఏర్పాటు చేసి పూర్తి తనిఖీలతో పాటు నిర్దిష్ట పాస్‌లు ఉన్నవారినే లోపలికి అనుమతించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచే బాపట్ల పట్టణంలోని దుకాణాలు అన్నింటిని పోలీసులు మూసివేయించారు.

సోమవారం రాత్రికే...

ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లు అందరూ సోమవారం రాత్రికే బాపట్లతో పాటు చీరాల రూరల్ పరిధిలోని రిసార్ట్‌లకు చేరారు. మంగళవారం ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే విధంగా వీరంతా ప్లాన్ చేసుకున్నారు. మరోవైపు పార్టీ శ్రేణులు సైతం భారీ సంఖ్యలోనే ఇప్పటికే బాపట్ల పరిసరప్రాంతాలకు చేరుకున్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

మూడు వారాల నిరీక్షణకు మంగళవారం తెరపడనుంది. గెలుపు అవకాశాలపై ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు ఎవరి ధీమాను వారు కనబరుస్తుండడం విశేషం. ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లతో పాటు తాజాగా వెల్లడైన ఎగ్జిట్ పోల్ అంచనాలు పాలక పార్టీ అభ్యర్థులను ఆత్మరక్షణలో పడేయగా, కూటమి అభ్యర్థులు జోష్ మీదున్నారు. సర్వేల లెక్కలన్నీ పక్కన బెట్టి ఓటర్లు తమ పక్షాన నిలబడ్డారన్న ధీమాతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు.

అద్దంకిలో అత్యధికంగా 88.25 శాతం

మే 13న జరిగిన ఓటింగ్ విషయానికొస్తే అత్యధికంగా జిల్లాలో అద్దంకి లో 88.25 శాతం పోలింగ్ నమోదైంది. తర్వాత స్థానాల్లో పర్చూరు 87.32, వేమూరు 86.43, బాపట్ల 83.02, చీరాల 82.61, రేపల్లె లో 82.59 పోలింగ్ శాతం నమోదైంది. రౌండ్ల వారీగా చూస్తే తొలి ఫలితం బాపట్లది కాగా, తుది ఫలితం అద్దంకిది కానుంది.



బాపట్ల బస్టాండ్ వద్ద మూసి వేసిన దుకాణాలు

వాహనాల మళ్లింపు ఇలా...

చీరాల వైపు నుంచి బాపట్లకు వచ్చే వాహనాలు జాతీయ రహదారి 216 మీదుగా సూర్యలంక రోడ్డులో నుంచి బాపట్ల పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. కర్లపాలెం వైపు నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారి 216 మీదుగా వెళ్లవలసి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థులకు కమ్మ కల్యాణ మండపం పక్కన దాని ఎదురుగా ఉన్న రెండు ప్రదేశాలను పార్కింగ్ కోసం కేటాయించారు. అధికారులకు, సిబ్బందికి విలియం బూత్ కళాశాల వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే కూటమి పార్టీల ఏజెంట్‌లకు, ఇండిపెండెంట్ అభ్యర్థుల ఏజెంట్లకు వై జంక్షన్‌లోని రాయల్ మెరైన్ కంపెనీ వద్ద పార్కింగ్ స్థలం కేటాయించారు. వైసీపీ ఏజెంట్లకు జాతీయ రహదారి 216 నుంచి నాగేంద్రపురం వెళ్లే రోడ్డు పక్కన పార్కింగ్ సౌకర్యం కల్పించడమైనది.

వెయ్యి మందికి పైనే విధుల్లో...



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఏఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లతో పాటు వివిధ హోదాల్లో దాదాపు వెయ్యిమంది పైనే సిబ్బంది కౌంటింగ్ విధుల్లో భాగస్వామ్యం కానున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు, ఈవీఎంలకు వేర్వేరుగా సిబ్బందిని కేటాయించారు. కౌంటింగ్ ప్రక్రియను మొత్తం వీడియో తీయనున్నారు. ఆర్వో నిర్ణయమే ఫైనల్‌గా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. మధ్యాహ్నం 1 గంటకు తొలి ఫలితం వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రక్రియ అంతా పూర్తయ్యేసరికి సాయంత్రం 6 కావచ్చని, బాపట్ల పార్లమెంట్ స్థానం కూడా ఉన్నందున రాత్రి వరకు కౌంటింగ్ జరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేమని యంత్రాంగం చెబుతోంది.

ఎమ్మెల్యే పిన్నెల్లికి బిగ్ షాక్

- కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లొద్దని సుప్రీం ఆంక్షలు



నరసరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపుకు వెళ్లరాదంటూ పిన్నెల్లిని ఆదేశించింది. పిన్నెల్లి బాధితుడు, పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రం తెలుగుదేశం పార్టీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు సోమవారం విచారించి ఆదేశాలు జారీ చేసింది. తనకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నుంచి ప్రాణహాని ఉందని, పిన్నెల్లికి 6 వరకు హైకోర్టు ఇచ్చిన అరెస్టు మినహాయింపు ఆదేశాలు రద్దు చేయాలని కోరుతూ శేషగిరిరావు రెండు పిటిషన్లను దాఖలు చేశారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో పిన్నెల్లి తనపై దాడి చేశాడని తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజు కూడా పిన్నెల్లి హింసకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనపై శేషగిరిరావు మరో పిటిషన్ దాఖలు చేశాడు. ఆధారాలున్నా ఎమ్మెల్యే పేరు, అనుచరుల పేర్లు లేకుండా కేసు పెట్టారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులంటూ ఎమ్మెల్యేకు అనుకూలంగా అధికారులు వ్యవహరించారని పిటిషన్లో తెలిపారు. ఈ అంశాలన్నీ హైకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ముందస్తు బెయిల్ ఇచ్చిందని పిటిషన్‌లో తెలిపారు. తీవ్ర ఘటనలైనా బెయిల్ మంజూరు చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. శేషగిరిరావు దాఖలు చేసిన రెండు పిటీషన్లపై విచారించిన సుప్రీంకోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది. పిన్నెల్లిని అరెస్టు చేయవద్దని హై కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు తప్పు పట్టింది. ఈవీఎం ధ్వంసం కేసులో పిన్నెల్లికి ఉపశమనం కల్గించి హైకోర్టు తప్పు చేసిందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది.

ఎమ్మెల్యే పిన్నెలి కదిలికలపై నిఘా

- సుప్రీంకోర్టు తీర్పుతో అప్రమత్తమైన పోలీసులు

నరసరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి ఓట్ల లెక్కింపుకు వెళ్లరాదంటూ సుప్రీంకోర్టు ఆదేశాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నరసరావుపేటలో పిన్నెల్లి కదిలికలపై నిఘా ఉంచారు. రెడ్డినగర్ సమీపంలోని కొత్తగా ఏర్పాటు చేసిన రియల్ వెంచర్‌లో వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ నివాసం ఉంటున్నాడు. ఈ ఇంటిలోనే పిన్నెల్లి ఉంటున్నాడు. పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన కేసులో హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ ఇస్తూ 6 వరకు ఎస్పీ కార్యాలయంలో సంతకం చేయాలన్న షరతు విధించింది. ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎస్పీ కార్యాలయంలో సంతకం చేసేందుకు కూడా బందోబస్తుతో తీసుకు వెళ్లేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి తరుపున కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించిన వారంతా రాత్రి ఆయనను కలసివెళ్లారు.

క్షణక్షణం.. ఉత్కంఠ



- కొన్ని గంటల్లో జాతకాలు వెల్లడి
- నేటి ఫలితాలపైనే అమరావతి భవితవ్యం
- కూటమి నేతల్లో గెలుపు ధీమా
- వైసీపీ వారిలో ఓటమి భయం
- పందేల రాయుళ్ల గుండెల్లో గుబులు

గుంటూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా ఈవీఎంలలో భద్రంగా ఉన్న రాష్ట్ర భవిష్యత్తు మరికొన్ని గంటల్లో వెల్లడి కానుంది. టీవీల ద్వారా ఎప్పటికప్పుడు ఫలితాలను తెలుసుకునేందుకు అన్ని వర్గాల ప్రజానీకం ఉత్కంఠతో ఎదురుచూస్తోంది. అందరూ తమ వ్యాపకాలను మంగళవారం పక్కన పెట్టి శెలవు దినంగా భావిస్తూ ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో తెలుసుకునేందుకు వేచి చూస్తున్నారు. అలాగే కోట్లలో పందేలు వేసిన బెట్టింగ్ రాయుళ్ళ గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నాయి. కొందరు పందెం రాయుళ్ళైతే తమ వద్ద నగదు లేకపోవటంతో స్థలాలను, పొలాలను కూడా తాకట్టు పెట్టి బెట్టింగ్‌లు పెట్టారు. సోమవారం కూడా పందేల పరంపర కొనసాగుతూనే ఉంది.

ఇక ఇప్పటికే వెలువడిన అత్యధిక సర్వేలతో కూటమి నేతలతో పాటు కూటమి తరపున పందేలు పెట్టిన బెట్టింగ్ రాయుళ్ళలో కూడా గెలుపు ధీమా కనిపిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 12 తరువాత సంబరాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కూటమి అభ్యర్థుల్లో కూడా సోమవారం నుంచి గెలుపు ధీమా మరింత మెరుగైంది. కేంద్రంలోనూ రాష్ట్రంలోను ఎన్‌డీఏ కూటమిదే విజయం అనే రీతిలో ఇంచుమించు అన్ని సర్వేలు వెల్లడి కావటం ఇందుకు కారణం. ఇక వైసీపీ నేతలు పోలింగ్ జరిగిన మరుసటి రోజు నుంచే డీలా పడిపోయారు. ఓటమిని వారు ముందుగానే గమనించటం మూలంగానే తమ అనుయాయులు ఎవరినీ కూడా వైసీపీ తరుపున పందేలు వేసేందుకు పురమాయించలేకపోయారు. అందువల్లే కూటమి తరపున పందేలు వేసేందుకు అనేక మంది ముందుకు రాగా వైసీపీకి అనుకూలంగా బెట్టింగ్ పెట్టేందుకు ఒకరో ఇద్దరో ముందుకు రావటం జరిగింది. అది కూడా కోసు పందేలకే పరిమితమయ్యారు. కూటమి అభ్యర్థులు రెండు రూపాయలు పెడితే వైసీపీ తరపున రూపాయి పందేలు ఎక్కువగా జరిగాయి. ఇక కౌంటింగ్ సమయం ఆసన్నం అవటంతో మరికొన్ని గంటల్లో తాము అధికారానికి దూరం కాబోతున్నామని ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఫలితాలను ముందుగా గ్రహించిన కొందరు ఉన్నతాధికారులు వైసీపీ నేతల ఫోన్లు ఎత్తటం మానేశారు. ఇప్పటివరకు సలాం కొట్టిన పోలీసులే లాఠీలు ఝళిపించేందుకు సిద్ధమవుతున్న పరిస్థితి నెలకొంది.

అమరావతి భవితవ్యం తేలేది నేడే...

సీఎం జగన్ మూడు రాజధానుల పేరుతో అమరావతి వెలుగులను మసక బారేటట్లు చేసి ఆఖరికి భూములను త్యాగం చేసిన రైతులపై సైతం లాఠీలు ఝుళిపించే స్థాయికి వెళ్ళిన విషయం తెలిసిందే. నవ్యాంధ్ర ప్రదేశ్ తొలి సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న రాజధానిపై అక్కసుతో అమరావతి పేరునే చెరిపేయాలని ఈ ఐదేళ్ళుగా ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఒక వైపు చంద్రబాబు హయాంలో నిర్మితమైన అసెంబ్లీ భవనాన్ని, సచివాలయ భవనాలను వాడుకుంటూనే అమరావతిని కూల్చే ప్రయత్నం చేశాడు. దీని ప్రభావం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉంది. అందువల్లే ఈ ప్రాంత ప్రజలు ఎంతో కసితో ఓటు వేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క సీటు కూడా వైసీపీ కి రాదనే అంచనా వేసి కొందరు ఆ పందేలు కూడా వేశారు. కొన్ని గంటల్లో వెలువడే ఫలితాలపైనే అమరావతి భవితవ్యం ఆధారపడి ఉంది. తిరిగి చంద్రబాబు సీఎం అయ్యే పక్షంలో మొదటగా ఆయన అమరావతిపైనే దృష్టి సారించనున్నారు. కేంద్రంలో కూడా ఎన్‌డీఏనే అధికారం లోకి వస్తుండటంతో తిరిగి అమరావతిపై ఆశలు అందరికి చిగురిస్తున్నాయి.

విధులు.. అప్రమత్తం

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి

బాపట్ల, జూన్ 3: కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని గుంటూరు రేంజ్‌ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహించే సిబ్బంది లోపలికి వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. కౌంటింగ్ సెంటర్‌లోని ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ ఆయనకు వివరించారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు నియమ నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో, పరిసర ప్రాంతాలలో చిన్న అవాంఛనీయ ఘటన కూడా జరగకూడదన్నారు. మొబైల్ డిపాజిట్ సెంటర్, మీడియా సెంటర్ పరిశీలించారు. కౌంటింగ్ సమాచారం మేరకు జిల్లాలో శాంతిభద్రతల పర్యవేక్షణ కొరకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను సందర్శించి విధులు నిర్వహించే సిబ్బంది అత్యంత వేగంగా స్పందించాలని సున్నితమైన అంశాలను త్వరితగతిన అధికారులకు తెలపాలని సూచించారు. సూచిక బోర్డులు, గ్యాంగ్‌వేలను పరిశీలించి ఎస్పీ వకుల్ జిందాల్‌కు పలుసూచనలు చేశారు. తదుపరి స్ట్రాంగ్‌రూమ్‌లను అక్కడ గార్డులు విధులు నిర్వహిస్తున్న విధానాన్ని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించటానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశామని కౌంటింగ్‌లో పాల్గొనే అభ్యర్థులు, ఏజెంట్‌లు నియమనిబంధనలకు లోబడి పోలీసువారి సూచనలు పాటించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు వీధులలోకి రాకూడదని తమ నివాసాల వద్దనే సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజలు సంయమనంతో వ్యవహరించాలి

: ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నిమిత్తం బాపట్ల పట్టణం, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో 144వ సెక్షన్ కౌంటింగ్ ముగిసే వరకు అమలలో ఉంటుందని తెలిపారు. వ్యాపార సముదాయాలు, హోటళ్ళు, రెస్టారెంట్‌లు, దుకాణాలు తెరవటానికి అనుమతిలేదన్నారు. 5డ్రోన్‌లతో సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో 600మంది పోలీసులు, కేంద్ర బలగాలతో పటిష్టమైన మూడంచల భద్రత ఏర్పాటు చేశామన్నారు. 1500మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఎక్కడైన ఘర్షణలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించటానికి అనుమతిలేదన్నారు. నలుగురి కంటే ఎక్కువమంది గుంపులుగా తిరగరాదన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాలలో సమర్థంగా విధులు నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే వాహనాలు, అభ్యర్థులు, ఏజెంట్‌లను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. హింసాత్మక ఘటనలు, ఘర్షణలకు పాల్పడటానికి ఉపయోగించే ఆయుధాలు, వస్తువులు వంటివి ఉంటే వెంటనే సంబంధితాధికారులకు సమాచారం అందించి వాహనం సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, డీఎస్పీ సి.హెచ్. మురళీకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది సూచనలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

పటిష్టభద్రత మధ్య కౌంటింగ్‌కు ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో పటిష్టభద్రత మధ్య ఓట్లలెక్కింపు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సోమవారం కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సీసీకెమెరాల నిఘా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగుసూచనలు చేశారు. ఓట్లలెక్కింపు కేంద్రాల ప్రక్రియ ముగిసేవరకు నిరంతరం నిఘా కొనసాగాలన్నారు. అధికారులు, సిబ్బందికి ఒక మార్గం, అభ్యర్థులు, వారి ఏజెంట్‌లు వెళ్ళటానికి మరో మార్గం ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రాలకు వెళ్ళే మార్గాల వద్ద దిక్సూచి బోర్డులను స్పష్టం ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. కేంద్రాలలో వీడియోగ్రఫీ ఏర్పాటు చేసి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌వో సి.హెచ్.సత్తిబాబు సిబ్బంది పాల్గొన్నారు.



క్లీంకారకు కల్కి టీమ్ గిఫ్ట్స్

విడుదల తేదీ దగ్గర పడడంతో 'కల్కి 2898 ఏ.డీ' చిత్ర బృందం ప్రచారం జోరు పెంచింది. ప్రమోషన్స్‌లో భాగంగా స్టార్ కిడ్స్‌కు గిఫ్ట్‌ను పంపిస్తోంది. ఇటీవలే ఈ గిఫ్ట్ రామ్‌చరణ్, ఉపాసనల కూతురు క్లీంకారకు చేరాయి. ఆ బహుమతుల్లో బుజ్జి-భైరవ స్టిక్కర్స్, బుజ్జి క్యారెక్టర్ బొమ్మ, టీషర్ట్‌లు ఉన్నాయి. ఆ గిఫ్ట్‌తో ఆడుకుంటున్న క్లీంకార ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఉపాసన.. కల్కి టీమ్‌కు కృతజ్ఞతలతో పాటూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ ప్రచారంలో భాగంగా త్వరలోనే మరింత మంది సెలబ్రిటీల పిల్లలకూ ఈ గిఫ్ట్ అందుతాయట. కాగా, అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా మూవీ 'కల్కి 2898 ఏ.డీ' ఈ నెల 27న విడుదల కానుంది. ప్రభాస్ హీరోగా నటించిన ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగే కథగా తెరకెక్కింది.

హిలేరియస్ ఎంటర్‌టైనర్



అదితి, జాన్సన్, హరినాథ్ పొలిచెర్లా, సుస్మితా ఛటర్జీ, సత్య ముఖ్య పాత్రలు పోషించిన ఈచిత్రం 'వాట్ ది ఫిష్'. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో విశాల్ బెజవాడ, విశాల్ బెజవాడ నిర్మించారు. 'ఇదొక యూనిక్ యాక్షన్ థ్రిల్లర్, హిలేరియస్ ఎంటర్‌టైనర్. ఇటీవల విడుదల చేసిన నిహారిక కొణిదెల, వెన్నెల కిశోర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.' అని దర్శక నిర్మాతలు చెప్పారు. వివిధ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/CWjbW6W లో చదవండి.

అటు రజనీకాంత్.. ఇటు ఎన్టీఆర్





తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం హిమాలయ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. తన ఆధ్యాత్మిక యాత్రలో భాగంలో కేదార్‌నాథ్, బద్రీనాథ్ దేవాలయాలను సందర్శించిన రజనీకాంత్ ఇప్పుడు అక్కడున్న సాధువులను కలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఓ సాధువుతో ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తూనే తన సినిమాల ముచ్చట్లు కూడా వివరించారు. ప్రస్తుతం 'వెట్టియాన్‌'లో నటిస్తున్నాను. నా వర్క్ పూర్తయింది. మిగిలిన నటీనటుల మీద చిత్రీకరణ జరుగుతోంది. విజయదశమి సందర్భంగా అక్టోబరు పదిన ఆ సినిమా విడుదల చేయాలనుకుంటున్నారు. నా కొత్త సినిమా 'కూలీ' షూటింగ్ ఈ నెల పదిన ప్రారంభమవుతుంది. ఈ సినిమాలకు లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తారు' అని ఆ సాధువుకు చెప్పారు రజనీకాంత్. జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'దేవర పార్ట్ 1' చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అదే రోజున రజనీకాంత్ సినిమా కూడా వస్తుండడంతో ఈ రెండు చిత్రాల మధ్య పోటీ తప్పదంటున్నారు సినీ పరిశీలకులు. అయితే రజనీకాంత్ చిత్రం విడుదల తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ రెండు చిత్రాల మధ్య పోటీ ఉంటుందా లేదా అని తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే!

థ్రిల్లర్స్ ఇష్టపడే వారికి నచ్చేలా సత్యభామ



థ్రిల్లర్ చిత్రాల స్పెషలిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల. సినిమాకు ఆయన ఇచ్చిన సంగీతం కంటే అందులోని నేపథ్య సంగీతంతోనే పాపులరైన శ్రీచరణ్.. తాజాగా మ్యూజిక్ అందించిన చిత్రం 'సత్యభామ'. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించగా.. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు.

"నేను కేవలం థ్రిల్లర్ మూవీస్‌కే ఎక్కువ వర్క్ చేస్తానని అందరూ అభిప్రాయపడుతుంటారు. కానీ నాకు అన్ని రకాల సినిమాలకు సంగీతం అందించడం ఇష్టం. ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలుంటాయి. అవి వేటికవే భిన్నంగా ఉంటూ.. అందరినీ ఆకట్టుకుంటాయి. థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే వారికి ఈ చిత్రం చాలా బాగా నచ్చుతుంది. ఇందులోని ట్విస్ట్‌లు అదిరిపోతాయి. ఒక పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. కాజల్‌కు ఇది పర్ఫెక్ట్ కమ్‌బ్యాక్ సినిమా అవుతుంది. ఇందులోని యాక్షన్ ఎపిసోడ్స్ థియేటర్స్‌లో సినిమాను చూసే ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి. పోరాట ఘట్టాల్లో ఆమె డూప్ లేకుండా చేశారు. కాజల్ కెరీర్‌లోనే ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. డైరెక్టర్ సుమన్ ఈ సినిమాను తన మేకింగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారు" అని చెప్పారు.

యూత్‌ను ఆకట్టుకుంటుంది



యదార్థ సంఘటనల ఆధారంగా.. యూత్ ఆడియెన్స్‌కు మెప్పించేలా తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. శ్రీనాథ్ పులకరం ఈ టీనేజ్ లవ్ డ్రామాకు దర్శకత్వం వహించగా, భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞశ్రీ వేణున్, రామ్ పటాస్, తేజగౌడ్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనాథ్ పులకరం మాట్లాడుతూ "ఇందులోని లవ్‌స్టోరీ ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా ఉంటుంది" అని చెప్పారు. నిర్మాత భువన్‌రెడ్డి కొవ్వూరి మాట్లాడుతూ "ఈ సినిమా యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్:కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: నిఖిల్ సురేంద్రన్, సంగీతం: కార్తీక్ రోడ్రిగజ్.

దిక్సూచి DIKSUCHI



గ్లోబలైజేషన్ ప్రక్రియ ఊపందుకున్న తరవాత ముఖ్యంగా రెండు వేల సంవత్సరం నుంచి ఐటీ రంగం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మధ్యలో రెండుసార్లు తలెత్తిన మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగమే కాకుండా హై పెయిడ్‌గా ఉండడంతో సంబంధిత చదువులకు డిమాండ్ అధికంగా ఉంది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కొంతకాలంగా ఎదురులేని కోర్సుగా మారింది. ఈ నేపథ్యంలో సదరు కోర్సుకు తోడు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న ఐటీ రంగంపై ఎన్ఐటి రాయపూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ **ఎన్.వి.రమణారావు** చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.

కంప్యూటర్లు, అల్గోరిథమ్స్ నుంచి ప్రోగ్రామ్స్ సర్క్యూట్స్ అలాగే సాఫ్ట్ వేర్, హార్డ్‌వేర్‌కుతోడు అప్లికేషన్స్(అన్వయం) సహా యావత్తు అధ్యయనం కంప్యూటర్ సైన్స్‌లో ఉంటుంది. ప్రాథమికంగా కంప్యూటర్లు, సంబంధిత అప్లికేషన్స్ అధ్యయనమే కంప్యూటర్ సైన్స్. సాఫ్ట్‌వేర్, అప్లికేషన్స్‌తోనే మొత్తం ప్రపంచాన్ని తెలుసుకునే స్వేచ్ఛను విద్యార్థికి అది కలుగజేస్తోంది. కంప్యూటర్ అల్గోరిథమ్స్, లాంగ్వేజ్‌లు సదరు మెషీన్లకు ప్రోగ్రామ్‌ను సమకూరుస్తాయి. డేటా స్ట్రక్చర్స్, నెట్‌వర్కింగ్ అదేవిధంగా కంప్యూటర్లలో నెట్‌వర్క్స్ అధ్యయనం కూడా ఉంటుంది. కేవలం సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్ స్టడీకే పరిమితం కాదు. సదరు రంగాలు అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తదితరాలూ ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: కంప్యూటర్స్‌కు సంబంధించి బేసిక్స్ నుంచి ఈ కోర్సులో నేర్చుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. సైన్స్ ఆఫ్ కంప్యూటర్స్ అంటే అందులోని ఆర్కిటెక్చర్ సహా కంప్యూటర్ సైన్స్. మెయిన్ ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, కంప్యూటర్ సర్క్యూట్స్ పరిచయం, యావత్తు ప్రక్రియను రన్ చేసే అల్గోరిథమ్స్ ఈ కోర్సు అధ్యయనంలో భాగం. మేథమెటిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఈ సబ్జెక్టు మూలాలు ఉన్నాయి. దాంతో అటు సాఫ్ట్‌వేర్, ఇటు హార్డ్‌వేర్ తెలుసుకోవాల్సి ఉంటుంది.

కంప్యూటర్ ఇంజనీరింగ్: సీఎస్ఈ మాదిరిగానే ఉన్నప్పటికీ చిన్నపాటి తేడాతో ఈ కోర్సు ఉంటుంది. కొన్ని టాపిక్స్ విషయంలో ఈ రెంటి మధ్య తేడా కనిపిస్తుంది. హార్డ్‌వేర్ల డిజైనింగ్, అసెంబ్లింగ్‌కు తోడు మైక్రోప్రాసెసర్ల సర్క్యూట్ డిజైనింగ్, సూపర్ కంప్యూటర్స్ ఈ కోర్సులో ఉంటాయి. అంతిమంగా దేశాన్ని సాంకేతికంగా నడిపేందుకు అవసరమైన విద్య ఉంటుంది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: కంప్యూటర్స్ డేటా మేనేజ్‌మెంట్‌కు తోడు నెట్‌వర్క్స్, నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ ఈ కోర్సులో ఉంటాయి. డేటా స్టోరేజీ, మానిప్యులేషన్ అధ్యయనంగా ఉంటుంది. డేటా అంటే ఇక్కడ మెషిన్లలో ఉన్నదని అర్థం.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటి): మెషిన్ కోడ్స్ కంప్యూటర్ లేదంటే ఎలక్ట్రానిక్ డివైజ్‌ను డ్రైవ్ చేసే డేటా ఈ కోర్సులో చదవాలి. నెట్‌వర్కింగ్ స్టడీ అంటే ఒకే పని చేస్తున్న డివైజ్‌ల మధ్య నెట్‌వర్క్‌ను ఎస్టాబ్లిష్ చేయాలి. వాణిజ్యపరంగా బిజినెస్ ప్రపంచంలో ఇది కీలకం.

స్టూడెంట్స్ చాయిస్ సీఎస్ఈ

కెరీర్ అవకాశాలు



- ★ కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ లేదా సంబంధిత ఏరియాలో డిగ్రీ ఉన్న వ్యక్తులుగా సిస్టమ్ ప్రోగ్రామర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, ప్రొడక్ట్ మేనేజర్, ఇంజనీరింగ్ మేనేజర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. ఉదాహరణకు కంప్యూటర్ సైన్స్‌లో నిపుణుడు సీనియర్ ప్రోగ్రామర్, సిస్టమ్ అనలిస్ట్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, డేటాబేస్ మేనేజర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ప్రోగ్రామ్‌లో ఎక్స్‌పర్ట్ - కంప్యూటర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్/అడ్మినిస్ట్రేటర్, డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, హెల్ప్‌డెస్క్ ఆపరేటర్, పీసీ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నిపుణుడు ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్, టెక్ సపోర్ట్ మేనేజర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, వెబ్‌డెవలపర్, వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, అప్లికేషన్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నిపుణుడు సిస్టమ్ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజర్, అప్లికేషన్ ప్రోగ్రామర్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ఫోరెన్సిక్ నిపుణుడు డిజిటల్ ఫోరెన్సిక్ అనలిస్ట్, ఎగ్జామినర్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్స్ టెక్నాలజిస్ట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, సిస్టమ్ ఇంజనీర్, డేటాబేస్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్ అసోసియేట్‌గా పనిచేయవచ్చు.
- ★ గేమ్స్ డిజైన్ ఎక్స్‌పర్ట్ గేమ్ డిజైనర్, గేమ్ ఆర్టిస్ట్, గేమ్ ప్రొడ్యూసర్, గేమ్ టెస్టర్, గేమ్ సౌండ్ ఇంజనీర్‌గా చేరవచ్చు.

కంప్యూటర్ సైన్స్ అనే కాదు, ఏ బ్రాంచ్ తీసుకున్న విద్యార్థికి అయినా తన సబ్జెక్టుపై లోతైన అవగాహన ఉండాలి. అప్పుడే జాబ్ మార్కెట్లో ఇతరులపై ఎడ్జ్ ఉంటుంది. అదే అనుకున్న లక్ష్యానికి చేరువ చేస్తుంది. అదేవిధంగా ఎంపిక చేసుకున్న రంగానికి సంబంధించి తదుపరి కోర్సులపై కూడా దృష్టిసారించాలి. ఎప్పటికప్పుడు టెక్నికల్‌గా అప్డేట్ అవుతూ ఉండాలి. తద్వారా మరింత పరిణతి సాధించాలి. అంటే ఈ రంగంలో నిలదొక్కుకోవాలంటే లైఫ్ లాంగ్ లెర్నింగ్(3ఎల్)కు అలవడాలి. మరోవైపు వాస్తవ పరిస్థితినీ గమనించాలి. పెద్ద ఎత్తున కోర్సులు అలాగే చాయిస్‌లు ఉన్న ఈ రోజుల్లో చదివిన కోర్సుకు తగ్గ ఉద్యోగం లభించడం, అందులో నిలదొక్కుకోవడం ఒక రకంగా కత్తిమీద సాము అనే చెప్పాలి. కంప్యూటర్ సైన్స్ విషయానికి వస్తే దాని పరిధి ఏటేటా విస్తృతమవుతోంది.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) లేదా డేటా సైన్స్, ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటి బ్రాంచీలను తీసుకునే ముందు విద్యార్థులు కొన్ని విషయాలను అర్థం చేసుకోవాలి. వాటిలో...

- మేథ్స్‌లో బలమైన పునాది ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఇది కీలకమైన సబ్జెక్టు. ఆల్జీబ్రా, కాలిక్యులస్, ప్రాబబిలిటీ, డిస్క్రీట్ మేథమెటిక్స్ చాలా ముఖ్యమైనవి.
- పైథాన్, జావా లేదా సి++ వంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు తెలిసి ఉండాలి. వేరియబుల్స్, లూప్స్, ఫంక్షన్స్, డేటాస్ట్రక్చర్స్ వంటి బేసిక్ ప్రోగ్రామింగ్ కాన్సెప్టులు తెలిసి ఉండాలి.
- కంప్యూటర్ల పనితీరుపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి. సీపీయూ, మెమరీ, స్టోరేజ్, ఆపరేటింగ్ సిస్టమ్స్ తెలియాలి.

3ఎల్ తప్పనిసరి

- బేసిక్ అల్గోరిథమ్స్, డేటా స్ట్రక్చర్స్ అంటే అరేస్, లింక్డ్ లిస్ట్స్, స్టేక్స్, క్యూస్, ట్రీస్, సార్టింగ్ అల్గోరిథమ్స్ వంటి కంప్యూటర్ సైన్స్ ఫండమెంటల్స్‌పై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.
- కంప్యూటర్ ఆర్కిటెక్చర్ బేసిక్స్ కూడా తెలియాలి. లాజిక్ గేట్స్, ప్రాసెసర్స్, మెమరీ హైరార్కీ, ఇన్‌పుట్/ఔట్‌పుట్ సిస్టమ్స్ వంటివి ఉపయోగకరం.
- సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్స్ కూడా తెలియాలి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రాసెసస్, డిజైన్ ప్యాటర్న్స్, టెస్టింగ్ మెథడాలజీస్, వెర్షన్ కంట్రోల్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.
- నెట్‌వర్కింగ్ అండ్ సైబర్ సెక్యూరిటీపై ప్రాథమిక అవగాహన ఉండాలి. నెట్‌వర్క్స్, ప్రొటోకాల్స్, సైబర్ సెక్యూరిటీ కాన్సెప్ట్స్ వంటివి ఇవాల్టి సాంకేతిక ప్రపంచంలో చాలా ముఖ్యం.
- ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌లో తరచూ ఎదరయ్యే క్లిష్టమైన ప్రాబ్లెమ్స్‌ను సమర్థంగా పరిష్కరించగలగాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను ఎంత బాగా నేర్చుకుంటే అంత మంచి కెరీర్ ముున్ముందు ఉంటుంది.

గణాంకాలు

ఈ ఏడాది జనవరి చివరి నాటికి ఐటీ సెక్టార్‌లో ఓపెనింగ్స్ 50,000 ఉన్నాయి. మునుపటి సంవత్సరంతో పోల్చుకుంటే తగ్గుదల 21 శాతం. అంతకుముందు సంవత్సరం అంటే రెండేళ్ళ క్రితంతో బేరీజు వేసుకుంటే 60 శాతం తగ్గింది. లింక్డిన్, ఇతర జాబ్ బోర్డులను పరిగణనలోకి తీసుకుంటే ఈ లెక్క తేలుతోంది. డేటా శాంపిల్స్‌లో 80 శాతం ఒకే విషయాన్ని రూఢిపరుస్తున్నాయి. ఎంట్రీ లెవెల్‌లో స్లంప్ ఇంకా బాగా చెప్పాలంటే పిరమిడ్‌లోని అట్టడుగున రిక్రూట్‌మెంట్స్ దాదాపుగా స్తంభించాయని చెప్పవచ్చు. ఎనిమిది నుంచి తొమ్మిది శాతం మేర అట్రిషన్స్(ఒక కంపెనీని వదిలి ఇంకో చోటకు వెళ్ళడం) ఉంటోంది. అయినప్పటికీ కొత్తగా హైరింగ్ ఉండటం లేదు. ఇంకో మాటలో చెప్పుకొంటే హైరింగ్ విషయంలో రిక్రూటర్లు అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ పరిణామాన్ని 'లో నుంచి నో హైరింగ్ యాక్షన్‌'గా 'ఎక్స్‌ఫెనో' కోఫౌండర్ అభివర్ణించారు. ఈ తగ్గుదల రెండేళ్ళుగా కొనసాగుతోంది. అన్ని పరిశ్రమలను లెక్కలోకి తీసుకుంటే అందులో ఉండే వైట్-కాలర్ జాబ్స్ స్పేస్ 2,10,000. కాగా జనవరి 2022ని ప్రామాణికంగా తీసుకుంటే తగ్గుదల 35 శాతంగా నమోదైంది. ఐటి సర్వీసెస్ సెక్టార్‌లో ప్రస్తుతం సిస్టమేటిక్ కరెక్షన్ చోటుచేసుకుంటోందని 'లాంగ్‌హౌస్ కన్సెల్టింగ్' సీఈఓ తెలిపారు. ఎంట్రీ లెవెల్ గ్రాడ్యుయేట్లతో ఇప్పుడు క్యాంపస్‌లు నిండి ఉన్నాయి. నిజానికి వీరు ఇప్పుడు ఒకటి, రెండేళ్ళ అనుభవం ఉండి ఉద్యోగం పోగొట్టుకున్న వాళ్ళతో పోటీపడాల్సి వస్తోందంటూ పరిస్థితిని వివరించారు. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ మందగించిందని, ఆ ప్రభావం ఇండియన్ టెక్నాలజీపై కూడా పడిందని డెలాయిట్ ఇండియా డైరెక్టర్ తెలిపారు. స్థూల ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చిత వాతావరణం ఫలితంగా క్లయింట్స్ చాలా అప్రమత్తంగా ఉంటున్నారని, ఇది రిక్రూట్‌మెంట్స్‌పై ప్రభావం చూపుతోందన్నారు. రాబోయే రెండు క్వార్టర్లలోనూ ఇదే పరిస్థితి ఉంటుదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాంకేతికంగా మెరుగుదల ముఖ్యంగా ఏఐ కూడా నియామకాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పారు. దరిమిలా మారుతున్న వాతావరణానికి తగ్గట్టు ఎదిగితేనే ఐటీలో కుదురుకోవచ్చని, ఇది ఎప్పటికైనా రెండు వైపులా పదును ఉన్న కత్తే అని కూడా హితవు చెబుతున్నారు.

సమగ్ర కథనం 'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/Iz9IMQyలో చదవండి.

అక్రమ మద్యం కేసులో వైసీపీ అభ్యర్థి తండ్రి



తుళ్లూరులో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

ఐదు కోట్ల మంది ఆత్మగౌరవం అమరావతి

● 1630వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జూన్3: ఐదు కోట్ల మంది తెలుగు ప్రజల ఆత్మగౌరవం అమరావతి రాజధాని అని భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసిన సీఎం జగన్‌రెడ్డి అండ్ కో కనుమరుగు అవుతుందని అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ మూడు రాజధానులకు వ్యతిరేకంగా అమరావతి రైతులు, రైతు కూలీలు, మహిళలు, ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1630వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో రాజధాని లేకుండా చేసిన వైసీపీ అడ్రస్ గల్లంతేనని స్పష్టం చేశారు. అన్ని వ్యవస్థలు జగన్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్వీర్యంగా మారాయన్నారు. కూలీలకు ఉపాధి లేదు, అమరావతి, పోలవరంతో సహా ఏ ప్రాజెక్టు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇటువంటి నియంత పాలన ప్రజలు ఒప్పుకోరన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ఓటమిని జగన్‌రెడ్డి చూడబోతున్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో రైతుల ఆందోళనలు నిరసన దీక్షలు కొనసాగాయి.

6న ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

గుంటూరు(విద్య), జూన్ 3: ఈనెల 6న ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కె.బసవలింగారావు, మహ్మద్‌ఖాలీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కోర్టు రోడ్డులోని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ కార్యాలయంలో ఉదయం 9.30కి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల, కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, సంపాదకులు వై.నేతాజీ తదితరుల హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలో ని అన్ని మండల, నగర, పట్టణ శాఖల అధ్యక్షప్రధాన కార్యదర్శి లు,జిల్లా సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ కన్వీనర్ మరియు సభ్యులు, ముఖ్య సీనియర్ నాయకులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

స్వస్థిశాలలో టీడీపీ నాయకుల

ప్రత్యేక ప్రార్థనలు



పెదకాకాని స్వస్థిశాలలో ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు

పెదకాకాని, జూన్ 3: పెదకాకాని స్వస్థిశాలలో టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థన జరిపించారు. సోమవారం మాజీమంత్రి నక్కా ఆనందబాబు, రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మద్దిరాల మ్యాని, రాష్ట్ర టీడీపీ నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

● నిందితుడు మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల భర్త శివనాగేంద్రం

● ఏ-2గా కేసు నమోదు చేసిన సెబ్ అధికారులు

● విచారణలో మరిన్ని పేర్లు వెల్లడయ్యే అవకాశం



సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాక్సులు

మంగళగిరి సిటీ, జూన్ 3: మంగళగిరిలో ఇటీవల సంచలనం రేకెత్తించిన అక్రమ మద్యం కేసులో అధికార వైసీపీ నేతల పాత్రపై స్పష్టత వచ్చింది. మంగళగిరి వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య తండ్రి కాండ్రు శివనాగేంద్రంపై కూడా కేసు నమోదుచేసినట్టు సెబ్ అధికారులు వెల్లడించారు. మంగళగిరి కాండ్రువారి వీధిలో దామర్ల వీరాంజనేయులు నివాసంలో అక్రమ మద్యం నిల్వలు వున్నట్టు సమాచారం రావడంతో ఈ నెల ఒకటో తేదీన సాయంత్రం మంగళగిరి సెబ్ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడుల్లో భారీగా మద్యం నిల్వలను గుర్తించారు. మద్యంసీసాలపై ఎలాంటి స్టిక్కర్లు లేవు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తెచ్చిన మద్యం నిల్వల్లో ఇదొక డంప్ మాత్రమేనని ఆరోపణలున్నాయి. హైదరాబాద్ బ్లూ బ్రాండ్ 120 బాక్సులు, ఓల్డ్ ట్రావెన్ 16 బాక్సులు కలుపుకుని మొత్తం సుమారు రూ.9.79లక్షల విలువైన 6,528 మద్యం సీసాలను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకుని వీరాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ప్రాథమికంగా విచారించగా మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల భర్త, మంగళగిరి వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య తండ్రి శివనాగేంద్రం తమ ఇంట్లో మద్యంనిల్వలను వుంచినట్టు అధికారులకు తెలిపాడు. దీంతో ఏ-2 నిందితుడిగా శివనాగేంద్రంపై కేసు నమోదుచేసినట్టు మంగళగిరి సెబ్ అధికా రులు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో బిజీగా వున్నామని, తదుపరి విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. అక్రమ మద్యం కేసుకు సంబంధించి సమగ్ర విచారణ జరిపితే మరిన్ని పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం వుంది. మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్న రోజే పలువురు వైసీపీ నాయకులు, లావణ్య తాలూకా బంధువులు సెబ్ కార్యాలయం వద్దకు చేరుకుని మంత్రాంగం నడిపే ప్రయత్నం చేసినట్టు సమాచారం.

బాణాసంచా పట్టివేత

పెదనందిపాడు, జూన్ 3: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్నారనే సమాచారంతో సోమవారం పెదనందిపాడులో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుంటూరు-పర్చూరు రహదారిలో లావు వారి చెరువు కట్ట సమీపంలో ఓ బడ్డీ కొట్టులో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రు.1,33,933 విలువ గల బాణసంచా సామాగ్రిని స్వాధీనం చేసుకొని, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మందపాడులో....

మేడికొండూరు, జూన్ 3: మండలంలోని మందపాడుకు చెందిన సయ్యద్ అమీర్ భాషా అనే వ్యక్తి భారీ మొత్తంలో బాణాసంచా తీసుకువచ్చి తన ఇంటిలో దాచి ఉంచగా విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు మేడికొండూరు ఎస్ఐ చల్లా వాసు తన సిబ్బందితో వెళ్లి బాణా సంచా నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. అమీర్ బాషాను అరెస్టు చేశారు. సుమారు రూ.70 వేల విలువైన 36 బాక్సుల క్రాకర్స్ తాను తెలంగాణ రాష్ట్రం చర్లపల్లి లోని ఒక దుకాణంలో కొనుగోలు చేసి తెచ్చానని అమీర్ వెల్లడించారు. మంగళవారం కోర్టులో హాజరు పరచనున్నట్టు వారు వివరించారు.



స్వాధీనం చేసుకున్న బాణసంచాతో ఎస్ఐ టి రాజ్‌కుమార్, సిబ్బంది

ముగిసిన చదరంగం పోటీలు

తాడికొండ, జూన్3: చెస్‌తో మేథో సంపత్తిని పెంచుకోవచ్చునని రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ పేర్కొన్నారు. రెండు రోజులుగా లాం చలపతి ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి సుమన్ ఈ సందర్భంగా మాట్లాడారు. దేశానికి చెందిన 17 ఏళ్ల యువకుడు ప్రపంచ చెస్ ఛాంపిన్ షిప్ పోటీలకు ఎంపికై దేశానికే కాదు ప్రపంచానికే యూత్ ఐకాన్‌గా నిలిచి దేశ కీర్తి ప్రతిష్టలు చాటారన్నారు. చెస్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. రెండురోజులుగా జరిగిన పోటీలలో చిత్తూరు జిల్లా మదనపల్లెకి చెందిన పీ. వెంకట రమణ విజేతగా నిలిచినట్లు తెలిపారు. అంతేకాకుండా మన రాష్ట్రం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. పోటీలలో ద్వితీయ స్థానంలో కుషల్, తృతీయ స్థానంలో అఫ్రిద్‌ఖాన్, నాల్గవ స్థానంలో రవికుమార్, ఐదవ స్థానంలో శ్రావణిలు గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షులు వీ. సత్యనారాయణరావు, సంయుక్త కార్యదర్శి మహ్మద్ అనిష్, చలపతి ఫార్మసీ కళాశాల ఫిజికల్ డైరక్టర్ భాను ప్రకాష్, గుంటూరు జిల్లా చెస్ అసోషియేషన్ ప్రతినిధులు ఎం.గోపినాద్, ఎం.సుమంత తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సుమన్ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి జీవీ

రాష్ట్రానికి వీడనున్న జగన్ దుష్టగ్రహణం

● అభ్యర్థి జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 3: ఆంధ్ర రాష్ట్రానికి జగన్ అనే దుష్టగ్రహణం నేటితో వీడనుందని వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం సూర్యోదయంతో పాటు చంద్రోదయం కూడా వస్తుందని, ప్రజలు కోరుకున్న విధంగా చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారన్నారు. దింపుడు కళ్ళెం ఆశతోనే వైసీపీ నాయకులు అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో వైసీపీ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించినా వారికి కోర్టుల నుంయి మొటిక్కాయలు తప్పలేదన్నారు. పేర్ని నాని, సజ్జల రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లాంటి సంఘ విద్రోహులను జైల్లో పెట్టాల్సిన అవసరముందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా పల్నాడులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలు పగులగొట్టడం, కూటమి ఏజంట్లపై దాడులు చేసి హత్యాయత్నాలకు పాల్పడడం, అరాచకాలు సృష్టించడం దుర్మార్గమని, అవి పల్నాడుకు మాయని మచ్చగా మిగిలాయన్నారు. కూటమి 150 పైగా అసెంబ్లీ స్థానాలు, 20పైగా లోక్‌సభ స్థానాలు గెలవబోతోందని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. వినుకొండ ప్రజలు ఎదురుచూస్తున్నట్లుగా అహంకారి బొల్లా బ్రహ్మనాయుడ్ని ఇంటికి పంపే సమయం ఆసన్నమైందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వరికపూడిశెల, పల్నాడు వాటర్‌గ్రిడ్, ఎస్ఎస్‌పీ కాలనీ అభివృద్ధి, ఘాట్‌రోడ్డు నిర్మాణాలను పూర్తి చేసి ప్రజల రుణం తీర్చుకొంటానన్నారు. మాజీఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఐదేళ్ళపాటు రాష్ట్రంలో జరిగిన దుర్మార్గం, అరాచకం, అన్యాయంతో ప్రజల్లో వచ్చిన మార్పుతోనే నూతన ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవడం ఖాయమన్నారు. వినుకొండ ప్రజలు జీవీ ఆంజనేయులు మంచితనాన్ని, సేవలను గుర్తించి మంచి మెజారిటీ ఇవ్వబోతున్నారని, రానున్న నూతన ప్రభుత్వంలో ప్రతిపక్షాలపై దాడులు, దౌర్జన్యాలు ఉండవని, తప్పుచేసినవారికి చట్టపరమైన శిక్షలు తప్పవన్నారు. బొల్లా బ్రహ్మనాయుడు ఇకనైనా ప్రతిపక్ష పాత్రను గౌరవప్రదంగా పోషించాలని కోరారు. షమీమ్‌ఖాన్, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాలపై ప్రతిక్షణం ఈసీ నిఘా ఉండాలి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



కౌంటింగ్ ఏజెంట్లకు దిశ, నిర్దేశం చేస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ప్రతిక్షణం ఎన్నికల సంఘం పటిష్ట నిఘా ఉంచాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. ఎన్ని పకడ్బందీ చర్యలు తీసుకున్నప్పటికీ ఇప్పటికీ కొందరు అధికారులు అధికార వైసీపీ బెదిరింపులు, ఒత్తిడులకు తలొగ్గే ప్రమాదం ఉందని, అలాంటి చోట్ల ఏమైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే నిజాలు సమాధి కాకుండా ఈసీ ముందు జాగ్రత్త, ప్రత్యామ్నాయ నిఘా ఏర్పాట్లు చూసుకోవాలని ఆయన కోరారు. సోమవారం స్థానిక ప్రత్తిపాటి గార్డెన్‌లో కౌంటింగ్ ఏజెంట్లకు దిశ, నిర్దేశ కార్యక్రమంలో ప్రత్తిపాటితో పాటు ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లావు మాట్లాడుతూ కౌంటింగ్‌కు వెళ్తున్న సభ్యులు ఎన్నికల సంఘం ఇచ్చిన నిబంధనలు, నియమావళిని తప్పక పాటించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏజెంట్లకు ఈసీ నిబంధనల పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. వైసీపీ నుంచి ఎవరైనా రెచ్చగొట్టినా సమన్వయం పాటించాలని, అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రత్తిపాటి సూచించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చెప్పినట్లు కౌంటింగ్ పూర్తిగా ముగిసి అభ్యర్థులు గెలుపు డిక్లరేషన్ అందుకొనే వరకు ప్రతి ఏజెంట్ అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాటి కోరారు.

ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడి మోసంపై ఫిర్యాదు



విలేకర్లతో మాట్లాడుతున్న దినకర రవీంద్రనాథ్

మంగళగిరి, జూన్ 3: ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు రూ.18 లక్షలు తీసుకుని స్థలం రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారని హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత రెవెన్యూ సూపరింటెండెంట్ కన్నెగంటి దినకర రవీంద్రనాథ్ ఆరోపించారు. మంగళగిరిలోని అమరావతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామానికి చెందిన జంజనం కోటేశ్వరరావు తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో వెంచర్ వేశారని చెప్పారు. ఆ వెంచరులో 183 చదరపు గజాల స్థలాన్ని (ప్లాట్ నెం.90) రూ.18 లక్షలకు కొనుగోలు చేసే నిమిత్తం 2021, డిసెంబరు 15న కోటేశ్వరరావుకు రూ.7 లక్షలు చెల్లించి ఎగ్రిమెంట్ చేయించుకున్నానని తెలిపారు. అదే నెలలో రిజిస్ట్రేషన్ నిమిత్తం మిగతా రూ.11 లక్షలు చెల్లించానని, అప్పటి నుంచి నేటి వరకు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశాడని ఆరోపించారు. ఇదే విషయమై సోమవారం మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద గల కార్యాలయంలో కోటేశ్వరరావును నిలదీయగా బాడీగార్డులతో బయటకు నెట్టివేయించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అన్యాయంపై మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు రవీంద్రనాథ్ తెలిపారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



శివ మృతదేహం

మాచర్లటౌన్, జూన్ 3: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మాచర్ల పట్టణ శివారులో సోమవారం రాత్రి జరిగింది. ఒంగోలు పట్టణానికి చెందిన నీలమ శివ(35) హైదరాబాద్‌లో బేల్దార్ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఏపీ 09జడ్ 7174 నంబరు గల పల్సర్ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి తన స్వస్థలమైన ఒంగోలుకు బయలుదేరాడు. మార్గ మధ్యంలోని మాచర్ల పట్టణ శివారులో గల ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ వద్దకు రాగానే ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తలకు తీవ్రగాయమై శివ అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విజయపురి సౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని జీవాల కాపరి మృతి



తిరుమలయ్య మృత దేహం

క్రోసూరు, జూన్ 3: గుర్తు తెలియని వాహనం ఢీకొని జీవాల కాపరి మృతిచెందిన ఘటన మం డలంలోని బాలెమర్రు గ్రామం వద్ద సోమవారం ఉదయం జరిగింది. తెలంగాణా రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తిరుమలయ్య(42) సహా కొంతమంది వ్యక్తులు బాలెమర్రు ప్రాంతంలో గొర్రెలు కాచుకుంటూ కొంతకాలంగా నివశిస్తున్నా రు. ఈ క్రమంలో సోమవారం ఉదయం రోడ్డుపై వెళ్తున్న తిరుమలయ్యను గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మరణించినట్టు స్థానికు లు తెలిపారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు క్రోసూరు ఎస్ఐ మహమ్మద్ షఫీ తెలియజేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.




మతుకుమల్లిలో పగులగొట్టిన సిమెంట్ రోడ్డు

సిమెంట్ రోడ్డు పగులగొడితే ఊరుకోం

మతుకుమల్లి(శావల్యాపురం), జూన్ 3: ఇంటింటికీ పైప్‌లైన్ వేస్తామంటూ బాగున్న సిమెంట్ రోడ్డును పగులగొడితే ఊరుకోమని గ్రామస్తులు కాంట్రాక్టర్‌ను అడ్డుకొన్న ఘటన శావల్యాపురం మండలం మతుకుమల్లి గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మతుకుమల్లి శ్మశానానికి వెళ్ళే బజారులో ఇంటింటికీ పైప్‌లైన్ వేసేందుకు గ్రామసర్పంచ్ యలగాల బసవయ్య కుమార్తు పొక్లెయిన్‌ను తీసుకొచ్చి సిమెంట్ రోడ్డుపై గాడులు తీయించేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకొన్నారు. తమకు పైప్‌లైన్ అవసరం లేదని, గ్రామంలోని తాగునీటి పథకం నుంచి తాగేందుకు నీళ్ళు రాకపోయినా ఇంతవరకు పట్టించుకొన్న నాథుడు లేడని, అటువంటిది బాగున్న సిమెంట్ రోడ్డుపై గాడులు తీసి దీన్ని కూడా నాశనం చేయవద్దని కాంట్రాక్టర్‌కు తెగేసి చెప్పారు. జల్‌జీవన్‌మిషన్ ద్వారా గతంలో కారుమంచి, గుంటుపాలెం, వయ్యకల్లు, కొత్తలూరు, గంటవారిపాలెం గ్రామాల్లో కూడా ఇలానే రోడ్లను పగులగొట్టి పైప్‌లైన్‌లు వేశారని, నాసిరకం పనులు చేయడంతో అక్కడ నెలల వ్యవధిలోనే పైప్‌లైన్‌లు చెడిపోయాయని, పైప్‌లైన్‌ల కోసం తీసిన గోతులు కూడా ఇంతవరకు పూడ్చలేదని అటువంటిది ఇక్కడ కూడా అలానే చేసేందుకు వచ్చారా అంటూ కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో కాంట్రాక్టర్ పను లు నిలిపేసి పొక్లెయిన్ తీసుకొని వెనుదిరిగాడు. ఉన్నతాధికారులు స్పందించి ఎన్ని కల కౌంటింగ్ సమయం లో గ్రామంలో ఎవ్వరూ అల్లర్లు సృష్టించకుండా త గిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి



ఆకురాతి బేబీ సరోజిని (ఫైల్)

తాడేపల్లి, జూన్ 3: తాడేపల్లి మండలం కొలనుకొండ బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... మంగళగిరి యల్.బి.నగర్‌కు చెందిన దమ్మాలపాటి కోటేశ్వరమ్మ, ఆకురాతి బేబి సరోజిని, డోగిపర్తి లక్ష్మీకాంతం, చిల్లపల్లి సరోజిని, విజయ అనే సుమారు 60 సంవత్సరాలు పైబడిన వృద్ధ మహిళలు ఆదివారం సాయంత్రం కొలనుకొండలోని ఇస్కాన్ టెంపుల్‌కు బయలుదేరి వెళ్లారు. ఆత్మకూరు నిర్మల కాన్వెంట్ వద్ద ఆటోలో బయలుదేరి కొలనుకొండ వద్ద బైపాస్‌లో దిగి రోడ్డు దాటుతుండగా కోటేశ్వరమ్మ, బేబి సరోజినిలను విజయవాడ నుంచి ఒంగోలు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కోటేశ్వరమ్మ మృతి చెందింది. బేబి సరోజిని తీవ్రంగా గాయపడింది. వారిని 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోటేశ్వరమ్మ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సరోజినిని ఆమె బంధువులు ప్రభుత్వ వైద్యశాల నుంచి తాడేపల్లి మణిపాల్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. బేబి సరోజిని కుమారుడు కాగా సరోజిని మృతదేహాన్ని సోమవారం సందర్శించి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పలువురు వైసీపీ నేతలు స్థానికులు ప్రముఖులు నివాళులర్పించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో తొలిసారిగా లివర్ ఆపరేషన్

గుంటూరు(మెడికల్), జూన్ 3: ఎడమ కాలేయంలో ఏర్పడిన రాళ్ల వల్ల తరచూ కామెర్ల బారిన పడుతున్న 57 ఏళ్ల రోగికి లివర్ రిసెక్షన్ (కాలేయం తొలగింపు) ఆపరేషన్ ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో విజయవంతంగా నిర్వహించారు. వివరాల్లోకి వెడితే.. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన 57 ఏళ్ల రోగి కడుపునొప్పి, జ్వరంతో ఏప్రిల్ 26న గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ ఓపీకి వచ్చారు. వివిధ పరీక్షల అనంతరం అతడిని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ విభాగానికి రిఫర్ చేశారు. బాధితుడి ఎడమ లివర్‌లో రాళ్లు ఉన్నట్టు, ఇవి జారిపడటం వల్ల అతడు తరచూ అనారోగ్యం బారినపడుతున్నట్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందే కోటి వెంకటేశ్వరరావు గుర్తించారు. అనంతరం క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి లివర్ ఎడమ భాగం తొలగించారు. మరొక కేసులో లివర్ నుంచి పేగుకు రక్తాన్ని తీసుకువెళ్లే పోర్టల్ వీన్ నాళం మూసుకుపోయి రక్తపు వాంతులు, విరేచాలు, రక్తహీనతతో బాధపడుతున్న గుంటూరుకు చెందిన 16 ఏళ్ల బాలుడికి స్ప్లినెక్టమీ డీవ్యాస్క్యులర్ సర్జరీ చేసి ఆరోగ్యం కుదుటపర్చినట్టు ఆయన తెలిపారు.



వైద్యబృందంతో ఆపరేషన్ చేయించుకున్న రోగులు

8 నుంచి ఆహ్వాన నాటిక పోటీలు



నాటిక పోటీల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పొన్నూరుటౌన్, జూన్3: ఈ నెల 8వ తేది నుంచి 23వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను పొన్నూరులో నిర్వహిస్తున్నట్లు పొన్నూరు కళాపరిషత్ అధ్యక్షుడు సూరినేని ఆంజనేయులు నాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రాంగణం వద్ద నాటక పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. జూన్ 8, 9, 10 తేదీల్లో నటరాజు, కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతి సందర్భంగా 23వ ఆహ్వాన నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికలో జరిగే ఈ నాటక పోటీలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

సజ్జల వ్యాఖ్యలు అప్రజాస్వామికం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా

భట్టిప్రోలు, జూన్ 3: ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించకుండా అడ్డగోలుగా మాట్లాడేవారే కౌంటింగ్ ఏజంట్లుగా రావాలని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పడం అపజయాన్ని ఒప్పుకున్నట్లేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌ను నియమ నిబంధలను బేఖాతరు చేయాలని ఎవరినీ లెక్కచేయొద్దని కార్యకర్తలకు చెప్పడం అప్రజాస్వామికమన్నారు. జగన్‌రెడ్డి ఓడిపోతున్నామనే భయంతోనే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ విషయంలో కోర్టుల చుట్టూ తిరుగున్నారని అపజయాన్ని అంగీకరించినట్లు కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులు వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహంతో వ్యతిరేకంగా ఓట్లు వేశారని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు రానున్న రోజుల్లో తగిన గుర్తింపు కల్పిస్తామన్నారు. భట్టిప్రోలులో జరిగిన అవినీతిపరులపై విచారణ చేయించి తగు చర్యలకు ఉపక్రమిస్తామని గ్రామంలో అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తామన్నారు. తెలుగుదేశం పోటీ చేసిన 144 సీట్లలో 133 సీట్లు, జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాలకు 21 గెలుస్తార ని, బీజేపీ పోటీ చేసిన 10 స్థానాల్లో 7 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని సాయిబాబా తెలియజేశారు.

చింతాయపాలెంలో ఘనంగా హనుమజ్జయంతి


చింతాయపాలెం ఆంజనేయస్వామి

కర్లపాలెం, జూన్ 3: మండలంలోని చింతాయపాలెం తెలగపాలెంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి ఏకశిల విగ్రహం వద్ద సోమవారం హనుమజ్జయంతి వేడుకలను సోమరౌతు శ్రీనివాసరావు కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అప్పాలపూజ, తమలపాకుల పూజ, పలు విశేష పూజలు, అభిషేకాలను వేలాది మంది భక్తుల మధ్య సోమవారం ఘనంగా నిర్వహించారు. పలుగ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆంజనేయస్వామికి నారికేళ ఫలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. 3,500 మంది భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు.

రైతునాయకుడు తిమ్మరాజు కృష్ణమూర్తి మృతి


తిమ్మరాజు కృష్ణమూర్తి (ఫైల్‌ఫొటో)

బాపట్ల, జూన్ 3: మాజీ సర్పంచ్, రామకృష్ణసేవా సమితి అధ్యక్షుడు, రైతు నాయకులు తిమ్మరాజు కృష్ణమూర్తి (90)సోమవారం మృతి చెందారు. బాపట్ల పట్టణంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారంలో ఆయన స్వగృహం నందు మృతదేహాన్ని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎమ్మెల్యే కోన రఘుపతి తదితర నాయకులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. కర్లపాలెం మండలం గణపవరం గ్రామసర్పంచ్‌గా చేసిన ఆయన రైతుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని పలువురు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులైన తిమ్మరాజు కృష్ణమూర్తి మృతి గురించి తెలుసుకున్న పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. సంతాపం తెలియజేసిన వారిలో పేరలి బాలకృష్ణమూర్తి, ఆవుల వెంకటేశ్వర్లు, జీవీ బ్రహ్మం, రావూరి నరసింహవర్మ తదితరులున్నారు.

పలువురు నేతల నివాళి

కర్లపాలెం, జూన్ 3, : తిమ్మరాజు కృష్ణమూర్తి మృతి రైతులకు తీరనిలోటు అని చింతాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు పెదమల్లు రంగారావు అన్నారు. తిమ్మరాజుకృష్ణమూర్తి మృతికి సంతాపం, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపినవారిలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, రావూరి నరసింహవర్మ, తోట వెంకటేశ్వరరావు, ఎండీ మొహిద్దీన్‌బేగ్, గరిగంటి రంగారావు, అప్పాజీ, రాపర్ల బాబా వరప్రసాద్, తిమ్మరాజు గిరిజమనోహర్, కత్తిదానియేలు, నల్లమోతువారిపాలెం సర్పంచ్ మాడా సుబ్రహ్మణ్యం, అంకిరెడ్డి మల్లిఖార్జునరావు, మాజీ ఎంపీపీ తాతా లీలా వరప్రసాదరావు తదితరులున్నారు.

ముగిసిన భగవద్గీత శిక్షణ శిబిరం


భగవద్గీత శిక్షణా కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, పండితులు

బాపట్ల, జూన్ 3: పట్టణంలోని పెదమస్తాన్ నగర్ కృష్ణమందిరంలో వాకా ట్రస్ట్, తపోవనం ఆధ్వర్యంలో భగవద్గీత శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించటం, మంత్రపుష్పం, ధ్యానంపై వాసుదేవానందా పిల్లలకు నేర్పించారు. విద్యార్థి దశలోనే జ్ఞానం, ధ్యానం, యోగం, చిన్నతనం నుంచి పిల్లలకు అవసరమని చెప్పారు. భగవద్గీత చదివిన పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్‌చైర్మన్ వాకా వినోద్‌లక్ష్మి దంపతులు పాల్గొని పెద్దలను సత్కరించారు. శిబిరంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తోటమల్లేశ్వరి, శ్రీనివాస్, యర్రా నాగేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి వాములు దగ్ధం


దగ్ధమవుతున్న వరిగడ్డి వామి

కొల్లూరు, జూన్ 3: వరిగడ్డి వాములు దగ్ధమైన ఘటన సోమవారం వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం.. కొల్లూరులోని ఫోర్ ఫ్రంట్ పాఠశాల వెనుక ఉన్న పొలాల్లో రెండు వరి గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ వరిగడ్డి వాములు కొల్లూరు కు చెందిన చందోలు సంగీతరావుకు చెందినవి. ఐదెకరాల వరి గడ్డిని రెండు వాములుగా వేశామని, ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఆదివారం అర్థరాత్రి సమయంలో తన వరిగడ్డి వాములకు నిప్పు పెట్టి దగ్ధం చేశారని బాధితుడు తెలిపాడు. వాముల విలువ సుమారు రూ.45 వేలు వరకు ఉంటుందన్నాడు.

ఆచార్య దేపురు భారతికి
11న సాంబయ్య స్మారక పరిషత్ అవార్డు ప్రదానం


దేపురు భారతి

తెనాలి రూరల్, జూన్ 3: ఆచార్య దేపురు భారతికి (వైస్ చాన్సలర్, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉమెన్స్ యూనివర్సిటీ తిరుపతి) విద్యా ప్రదాత సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు సీహెచ్.భాస్కరరావు (భాస్కర్), సీహెచ్ సాంబయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్, ఖాజీపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో సీహెచ్ సాంబయ్య 35వ వర్ధంతిని పురస్కరించుకుని 11వ తేదీన అవార్డు ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ కంచికామకోటిపీఠ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయం ఆవరణలోని అన్నమయ్య కళావేదిక వద్ద 11వ తేదీ మంగళవారం, సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అలాగే 10వ తరగతి ఫలితాలలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ 599 మార్కులు సాధించిన విద్యార్థిని ఆకుల వెంకటనాగసాయి మనస్వికి రూ.10,000 ప్రోత్సాహక నగదు బహుమతి పురస్కారంతో సత్కరించడం జరుగుతుందన్నారు. తొలుత నాట్యమయూరి లేఖ్యాభరిణి బృందం, విజయవాడ వారి నృత్యప్రదర్శన అనంతరం పురస్కార ప్రదానోత్సవాలుంటాయని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

పేదల కోసమే ఉపాధి హామీ పనులు : ఏపీవో రవి

కొల్లిపర, జూన్ 3: పేదల కోసమే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు పథకాన్ని ప్రవేశ పెట్టారని డీఆర్‌డీఏ ఏపీవో ఎం రవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, దావులూరిపాలెం, అన్నవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధిహామీ పనులపై కూలీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు



జిల్లాలో ఓట్లలెక్కింపు జరిగే బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల


బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఎదురు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

బాపట్ల, జూన్ 3: కౌంటింగ్ కేంద్రాల వద్ద, పరిసర ప్రాంతాల్లో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా రాజకీయపార్టీలకు సంబంధించిన నాయకులు, ఏజెంట్లు వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు ప్రత్యేక ప్రాంతాలను సిద్ధం చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులు, ఏజెంట్లు పార్కింగ్ చేసుకునేందుకు వేర్వేరు ప్రాంతాలను సిద్ధం చేసి బోర్డులు పెట్టారు. కౌంటింగ్ కేంద్రానికి 200 మీటర్ల బయట వాహనాలను తనిఖీ చేసి పంపే విధంగా చర్యలు చేపట్టారు. అలాగే 100మీటర్ల బయట అభ్యర్థులు, ఏజెంట్లను, విధులు నిర్వహించటానికి వచ్చే ప్రభుత్వ ఉద్యోగులను తనిఖీ చేసి వారి గుర్తింపు కార్డులను పరిశీలించి పంపించే విధంగా ఏర్పాట్లు చేశారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల చుట్టూ పోలీసుల నిఘా పెట్టారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అవసరమైన ఏర్పాట్లు చేసి పర్యవేక్షిస్తున్నారు.


జీబీసీరోడ్డుపై పెట్టిన బారికేడ్‌లు


డ్రోన్‌ల ఏర్పాటును పరిశీలించి సూచనలు చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గెలుపోటములపై జోరుగా బెట్టింగ్‌లు

● 5 నుంచి 20 లక్షల వరకు పందాలు

● అనగాని గెలుపు కోసం ప్రత్యేక పూజలు

రేపల్లె, జూన్ 3: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, వైసీపీ మధ్య ప్రతిష్ఠాత్మకంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడనున్న నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు గెలుపోటములపై బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. అభ్యర్థుల మెజార్టీ ఓట్లను బూత్‌ల వారీగా లెక్కేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికలు జరిగి 22 రోజులు గడిచిన అనంతరం వివిధ ఛానల్స్ ఎగ్జిట్‌పోల్స్ విడుదల చేయటంతో పలువురు పందాలు కాస్తున్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ నాయకులు ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటూ మండలాల్లోని బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిని పరిశీలించుకుంటూ గెలుపోటములపై లక్షలాది రూపాయలు పందాల రూపంలో చేతులు మారాయి. నియోజకవర్గంలోని రేపల్లెరూరల్, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల వారీగా పోలైన ఓట్లను సమీకరిస్తూ ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయి అంటూ ఆయా గ్రామ, మండల స్థాయి నాయకులు గ్రామాలవారీగా లెక్కలేసుకుంటూ గెలుపు మాదంటే మాదని ఆ రెండు పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు మంగళవారం రానున్న నేపథ్యంలో పార్టీల నాయకుల్లో టెన్షన్ మొదలైంది. నియోజకవర్గంలో 2,27,232 ఓటర్లు ఉండగా పురుషులు 1,11,240 ఓట్లు, మహిళలు 1,15,979 ఇతరులు 13 ఓట్లు ఉండగా 264 పోలింగ్ బూత్‌లలో మొత్తం మీద స్త్రీలు, పురుషులు కలిపి 1,87,698 మంది ఓట్లు పోలవ్వగా 82శాతం నమోదైంది. తెలుగుదేశం పార్టీ గతంలో చేసిన అభివృద్ధి పనులు స్థానిక ఎమ్మెల్యేగా అనగాని అందరికి అందుబాటులో ఉంటూ ప్రజలకు అండగా నిలవటంతో అనగాని వైపే ఓటర్లు మొగ్గు చూపారు. కులమతాలకు అతీతంగా అనగానికి ప్రజలంతా మద్దతు తెలపడంతో మూడోసారి అనగాని విజయం తథ్యమని నియోజకవర్గ ప్రజలు బాహటంగా తెలుపుతున్నారు. పోలింగ్‌లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పురుషుల కంటే ఎక్కువగా మహిళా ఓట్లు పడటంతో తెలుగుదేశం పార్టీ విజయానికి కలిసొచ్చే అంశాలని తెలుపుతున్నారు. వైసీపీ నాయకులు మాత్రం చంద్రబాబుపై వ్యతిరేకతతో ఉన్న ప్రజలంతా వైసీపీకి ఓట్లు వేశారని, మాస్ ఓట్లు ఎక్కువగా పడ్డాయని విజయం మాదేనంటూ తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో రింగ్‌రోడ్డు సెంటర్, అంకమ్మచెట్టు, కృష్ణాటాకీస్, రాజ్యలక్ష్మి థియేటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్, మసీదు సెంటర్ల వద్ద రెండు పార్టీల నాయకులు 5 నుంచి 20 లక్షల వరకు, చిన్నచిన్న నాయకులు 50వేల నుంచి 2 లక్షల వరకు జోరుగా పందాలు కాసుకుంటున్నారు. ఫలితాలు రావటానికి మరికొన్ని గంటలు మాత్రమే ఉన్న నేపథ్యంలో పందెంరాయుళ్ళు ఆచితూచి అన్ని సర్వేలను మననం చేసుకుంటూ పందాలు కాస్తున్నారు.


అనగాని గెలుపు కోసం గ్రామదేవత బూరగలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్

ఓట్లు లెక్కింపునకు తరలివెళ్లిన పార్టీల నాయకులు

రేపల్లె నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు గురు వారం వెలువడనున్న నేపథ్యంలో తెలుగుదేశం, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు నాయకులు మంగళవారం మధ్యాహ్నం నుంచే బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పయనమయ్యారు. ఉదయం ఆరుగంటలకే కౌంటింగ్ హాలుకు అనుమతి ఇస్తారని, 7 గంటల తర్వాత నుంచి అనుమతించరనే నేపథ్యంలో మంగళవారం ఆయా పార్టీల నాయకులు ఇష్ట దేవతలను కొలుచుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బయల్దేరారు.

ఎమ్మెల్యే అనగాని గెలుపునకు ప్రత్యేక పూజలు..

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ ఆనవాయితీగా ఇష్టదైవమైన మార్కెట్ వద్ద నున్న మహాగణపతి ఆలయంలో, బూరుగలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితుల ఆశీర్వచనం తీసుకుని ఏజంట్లతో బాపట్ల కౌంటింగ్ హాలుకు బయల్దేరి వెళ్లారు. వీరి వెంట టీడీపీ నాయకులు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, మద్రాస్ సాంబశివరావు, గుర్రం మురహరిరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, పి.సాయికుమార్, ఆలపాటి వేణు, కేసన వాసు తదితరులు తరలివెళ్లారు.

నేడు ఓట్ల లెక్కింపు

● నాగార్జున యూనివర్సిటీలో కౌంటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు

● తేలనున్న అభ్యర్థుల భవితవ్యం


నాగార్జున యూనివర్శిటీలో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాటు

పొన్నూరు టౌన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగింపు దశ మంగళవారం ఓట్ల కౌంటింగ్‌తో ప్రారంభం కానున్నది. పొన్నూరు నియోజకవర్గంలో గత ఆరు నెలలుగా ఎన్నికల నిర్వహణ రాజకీయ పార్టీల ప్రచారాలు హోరాహోరీగా సాగాయి. రికార్డు స్థాయిలో పోలింగ్‌శాతం 86శాతం పైగా సాగింది. మొత్తం 264 పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంల ద్వారా 1,93,019ఓట్లు పోలయ్యాయి. వీటికి అదనంగా ఉద్యోగులు, ఎన్నికల విధులో ఉన్న సిబ్బంది 2,428 ఓట్లను వినియోగించుకున్నారు. 85మంది సర్వీస్ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 85ఏళ్ల దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు 277మంది హోం ఓటింగ్ విధానంలో తొలిసారిగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరే కాకుండా దేశ సరిహద్దులో ఉన్న సైనికులు, కొన్ని రక్షణ విభాగాలో ఉన్న 201మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం1,96,010మంది ఓటు హక్కును పొన్నూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు వినియోగించుకున్నారు. పోలైన ఓట్లశాతం 86.29గా నమోదైంది. పొన్నూరు శాసనసభ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఇదే అత్యధిక పోలింగ్‌శాతం నమోదైంది. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పొన్నూరు శాసనసభ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విస్తృత ఏర్పాట్లను అధికారులు చేశారు. పొన్నూరు నియోజకవర్గంలో 215పోలింగ్ కేంద్రాల్లో 264 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఈ పోలింగ్ బూతులో ఈవీఎంలను ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచగా ఉదయం 7.30 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ను ఓపెన్‌చేసి లెక్కింపు ప్రక్రియను ప్రారంభించటానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియను కూడా ఎన్నికల అధికారులు పూర్తిచేసి ఏజెంట్లను గుర్తింపుకార్డులు జారీచేశారు. తొలిగా మొదటి రౌండ్‌లో పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామ ఫలితం లెక్కించనున్నారు. చివరిగా పొన్నూరు మండలంలోని ఇట్టికంపాడు గ్రామ ఫలితాలను లెక్కిస్తారు. ఒక్కో రౌండ్ లెక్కింపునకు 20 నిమిషాల సమయం కేటాయించగా వీటికి అదనంగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా టేబుళ్లను ఏర్పాటుచేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు తొలుత ప్రారంభమైనప్పటికి వీటి ఫలితం తేలేవరకు ఆలస్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమైన కొద్ది సేపటి తర్వాత ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈవీఎంల ఫలితం 20 నిమిషాల్లోనే తేలనున్నందున తొలి ఫలితం ఈవీఎంల నుంచే వస్తుందని అధికారులు రాజకీయ పార్టీల నాయకులు అంచనా వేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్ననికే ఫలితాలు తేలే అవకాశం ఉందని అంచనాలు వున్నాయి.

ప్రధాన పోటీ టీడీపీ, వైసీపీ మధ్యే...

పొన్నూరు నియోజకవర్గంలో ప్రధాన పోటీ తెలుగుదేశం పార్టీ, వైసీపీ అభ్యర్థుల మధ్యే ఉండనున్నది. బరిలో 14మంది నిలిచారు. టీడీపీ నుంచి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, వైసీపీ నుంచి అంబటి మురళీకృష్ణ, బీఎస్పీ నుంచి యాతాటి కిషోర్, కాంగ్రెస్ పార్టీ నుంచి జక్కా రవీంద్రనాథ్, బీసీకే పార్టీ నుంచి కూరపాటి మాణిక్యరావు తదితరులు పోటీలో ఉన్నారు.

తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో...

తెనాలి అర్బన్, జూన్ 3: నాగార్జున యూనివర్శిటీలో తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. నియోజకవర్గంలోని 273 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2 లక్షల 67 వేల 624 ఓట్లు ఉండగా మే 13న జరిగిన పోలింగ్‌లో 2 లక్షల 3 వేల 825 ఓట్లు పోల్ అయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాట్లు చేశారు. 20 రౌండ్లలో లెక్కింపు పూర్తి అవుతుంది. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. ఉదయం 8.30 గంటలకు కౌంటింగ్ మొదలు అవుతుంది. అదేవిధంగా సుమారు 3800 వరకు వచ్చిన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు 500 బ్యాలెట్లు ఇచ్చి రెండు రౌండ్లలో లెక్కింపును పూర్తిచేస్తారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు మొదలుపెడతారు. ఇదే విధంగా తెనాలి అసెంబ్లీ పరిధిలోని పార్లమెంట్ ఓట్ల లెక్కింపును కూడా అధికారులు ఏర్పాట్లుచేశారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లకు ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. తెనాలి సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రఖర్‌జైన్‌తో పాటు తెనాలి, కొల్లిపర రెవెన్యూ యంత్రాంగం, అధికారుల బృందం కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తుంది.

ముగిసిన చిట్టి ఆంజనేయస్వామి ఆలయ శతాబ్ది ఉత్సవాలు


చిట్టి ఆంజనేయ స్వామికి మల్లెల పూజ

తెనాలి అర్బన్, జూన్ 3: బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయ స్వామి ఆలయ శతాబ్ది ఉత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామి వారికి జంబీర ఫలాలు, లక్ష మల్లెలతో విశేష పూజలు చేశారు. పౌరాణిక ప్రముఖులు నోరి నారాయణమూర్తి సుందరకాండ కథాగానం చేశారు. దాసరి శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్‌లు ఆర్థిక సహకారం అందించారు. లక్ష్మరాజు విజయమోహనరావు సహకారంతో ప్రసాదాలు పంపిణీ చేశా రు. ఉత్సవ కమిటీ సభ్యులు రత్నాకర శాస్త్రి, అర్చకులు యోగానంద చక్రవర్తి, వేణుమాధవ్ ఉత్సవాలను పర్యవేక్షించారు. షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గాయత్రి హోమం, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ఈ నెల 16 వరకు ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. స్వామి వారికి సింధూరార్చన ఆగమ పండితులు నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథశర్మ పురాణ ప్రవచనం చేశారు. ఈవో శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ శివ, నిఖిల్, కౌన్సిలర్ త్రిమూర్తి, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 144 సెక్షన్ అమలు

● దుకాణాలు బంద్ చేయాలని పోలీసుల హెచ్చరిక

కొల్లూరు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపు సందర్భంగా నలుగురు అంతకు మించి ఎక్కువ మంది గుంపులుగా రోడ్లపై ఉండరాదన్నారు. 3వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 5వ తేదీ రాత్రి 11 గంటల వరకు కొల్లూరుతో పాటు మండల గ్రామాల్లో దుకాణాలు, బడ్డీ కొట్లు, హోటల్స్ మూసివేయాలన్నారు. బాణసంచా కాల్చేందుకు అనుమతులు లేవన్నారు. మైకులు, డీజేలను నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన అనంతరం గెలుపొందిన పార్టీలకు చెందిన వారు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు చేయకూడదన్నారు. పోలీసు ఆంక్షలను అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి : ఎస్ఐ రాజశేఖర్


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

వేమూరు, జూన్ 3 : ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమల్లో ఉన్నందున కూడళ్ళ వద్ద గుమికూడటం వంటి పనులు చేయరాదని వేమూరు ఎస్ఐ రాజశేఖర్ తెలియజేశారు. సోమవారం వేమూరు మెయిన్ రోడ్‌లో వర్తక వ్యాపారులు, గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఈనెల 4, 5 తేదీల్లో షాపులు, హోటళ్ళు మూసి వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గుమికూడకుండా ఉండాలని, పోలీస్ హెచ్చరికలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నిబంధనలు పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

● ఎస్ఐ టి.అనీల్‌కుమార్

పిట్టలవానిపాలెం, జూన్ 3: మండలంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా గ్రామాల్లోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమ పార్టీలకు చెందిన గెలుపు, ఓటమిలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దు అని చందోలు ఎస్ఐ టి.అనీల్‌కుమార్ తెలిపారు. సోమవారం అన్ని గ్రామపంచాయతీలలో చందోలు ఎస్ఐ మైక్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సర్వే


ఇంటింటికి తిరిగి ప్రత్యేక అవసరాల గల పిల్లల సర్వే చేస్తున్న భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు

పిట్టలవానిపాలెం, జూన్ 3 : మండల పరిధిలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహిస్తుందని ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా సమగ్రశిక్ష కోఆర్డినేటర్ మట్టా జోత్స్న మండలంలోని చందోలు గ్రామంలో సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సర్వేను ఉద్దేశించి మాట్లాడుతూ 0నుంచి 18 సంవత్సరాలు వయస్సు కలిగిన వివిధ రకాల వైకల్యం కలిగి న పిల్లలను గుర్తిస్తుందన్నారు. చెవిటి, మూగ, మానసిక దివ్యాంగులు, ఆర్టిజన్, మస్తిష్కపక్షవాతం, ఫిజికల్ హ్యాండ్ క్యాపెడ్, తలసేమియా, పార్కిసన్స్ వంటి వివిధ రకాల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పిస్తుందని ఆయన తెలిపారు. ఈ ఇంటింటి సర్వే ద్వారా, అంగన్‌వాడీ సెంటర్స్ గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా పిల్లల వివరాలను సేకరించడం జరుగుతుందని, తల్లిదండ్రులు, అధికారులు సహకరించి ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాల సర్వే విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈ ఆర్పి రత్నబాబు, ఐఈటీ ఆర్పి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయశాఖాధికారికి తెలుగుబుక్ ఆఫ్ రికార్డు అవార్డు


తెలుగుబుక్ ఆఫ్ రికార్డు అవార్డును అందుకుంటున్న పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయశాఖాధికారి ఎం శ్రీనివాసరావు

పిట్టలవానిపాలెం,జూన్ 3 : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయశాఖాధికారి ఎం శ్రీనివాసరావుకు ఆదివారం విజయవాడలోని గాంధీనగర్ నందు హనుమంతరాయ శాఖా గ్రంథాలయంలో తెలుగుబుక్ ఆఫ్ రికార్డు అవార్డును డాక్టర్ యూవీ రత్నం ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్ ఏపీ అసెంబ్లీ ఓఎస్‌డీ అందజేశారు. ఈ సందర్భంగా పిట్టలవానిపాలెం మండలశాఖ గ్రంథాలయాధికారులు, పాఠకులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

వైకుంఠపురం ఆలయ ఆదాయం రూ.32 లక్షలు


హుండీ లెక్కింపు చేస్తున్న సిబ్బంది

తెనాలి అర్బన్, జూన్ 3: వైకుంఠపురం ఆలయానికి రూ.32 లక్షల ఒక వెయ్యి 350రూపాయల ఆదాయం లభించింది. శ్రీలక్ష్మి పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు సమర్పించిన హుండీలను లెక్కించారు. మూడు నెలల కాలానికి గాను ఈ ఆదాయం లభించింది. ఉండవల్లి గ్రూపు ఆలయాల ఈవో కె.సునీల్‌కుమార్ పర్యవేక్షణలో చెంచుపేట గ్రామీణ బ్యాంకు సిబ్బంది, స్కౌట్స్ గౌడ్స్ దేవస్థాన సిబ్బంది పాల్గొని లెక్కింపు చేశారు. ఈవో తిమ్మానాయుడు పర్యవేక్షించారు.

6 నుంచి హులిగమ్మ అమ్మవారి జాతర

చేబ్రోలు, జూన్ 3: శేకూరు హులిగమ్మ అమ్మవారి 6వ జాతర మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గుంటుపల్లి శ్రీనివాసరరావు గురుస్వామి తెలిపారు. సోమవారం శేకూరు ధర్మశాస్త్ర పీఠంలో ఆయన జాతరకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తొలిరోజు 6వతేదీ గురువారం అమ్మవారికి పంచామృత అభిషేకం, అమ్మవారి పుట్టింటి నుంచి మేళ తాళాలతో పసుపు, కుంకుమలు సమర్పించడం జరుగుతుందన్నారు. రెండో రోజు శుక్రవారం సహస్రనామ మల్లెల పుష్పార్చన, భక్తుల నడుమ, వివిధ వేషధారణలు, డప్పు వాయిద్యాలలు, నృత్యప్రదర్శనలతో వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. చివరిరోజు శనివారం గాజుల అలంకరణ, అమ్మవారికి పొంగళ్లు, ప్రభోత్సవం, ఉయ్యాలసేవతో పూజలు ముగియనున్నాయని పేర్కొన్నారు.

బిల్లుల మోత.. అప్రకటిత విద్యుత్ కోత..!

- రాత్రింబవళ్లు ఇష్టారీతిగా కరెంట్ కట్
- గతంలో మునిసిపాలిటీ నిధుల నుంచి ముందస్తుగా రూ.9కోట్లు అప్పగింత
- అయినా తప్పని సమస్య
- పల్లెలను పట్టించుకునే నాథుడే లేరు
- అవస్థలు పడుతున్న ప్రజలు



చీరాలటౌన్, జూన్ 3 : విద్యుత్ బిల్లులు మోత మోగిస్తూనే, అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ విద్యుత్ అధికారులు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. ఒకవైపు భయానకంగా ఎండలు మండుతున్నాయి. దీంతో నివాసాలు ఉక్కపోతగా మారాయి. ఈక్రమంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు వేడిగాలులకు అల్లాడుతున్నారు. మరోవైపు కరెంట్ రిలీఫ్ పేరుతో విద్యుత్ సరఫరాలు అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారు. వర్షం కురుస్తుందన్నా లేక గాలి వీస్తుందన్నా అంతకంటే ముందే సరఫరా ఆపుతున్నారు. అంతేకాకుండా లైన్ క్లియరెన్స్ పనులంటూ గంటలకొద్దీ అంధకారాల్లోకి తోస్తున్నారు. నోటితో మాత్రం 24 గంటలు నిరంతర సరఫరా అంటూ, సాంకేతిక లోపాలను ఉదహరిస్తు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎడాపెడా కోతలు విధిస్తు ప్రజలను వేధిస్తున్నారు. అంతేకాకుండా పెరిగిన చార్జీలు కారణంగా ఇళ్లల్లో వాడకం తగ్గించినా విద్యుత్ బిల్లుల్లో ట్రూ అప్ చార్జీలు, ఇంధన కొనుగోలు చార్జీలు అంటూ వినియోగదారునికి అదనపు వాతలు పెడుతున్నారు. ఈనేపథ్యంలో ఇంట్లో ఫ్యాన్ తిరగక, బయట ఎండకు తట్టుకోలేక సామాన్యులు బతుకు జీవుడా అంటున్నారు. ఇదిలావుంటే గతంలో మునిసిపల్ నిధుల నుంచి అప్పటి అధికారులు, పాలకులు విద్యుత్ సమస్యలు నియంత్రించేందుకుగాను మునిసిపాలిటీ నిధుల నుంచి ముందస్తుగా రూ. 9కోట్లు నిధులు విద్యుత్ అధికారులకు అప్పగించారు. వీటిపై అధికారులు కూడా చాలాచోట్ల విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చారు. మరమ్మతులు చేశారు. అయినా కోతలు తప్పకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలో అనేక ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు ఉన్నాయి. అయితే అప్రకటిత కోతలు కారణంగా హాస్పిటల్స్‌లో అసౌకర్యం ఏర్పడుతుంది. మరోవైపు ఎన్నికల కోడ్ ఉన్నందున పెట్రోల్ బంకుల్లో డబ్బాలలో డీజిల్ పోయడం లేదు. దీంతో హాస్పిటల్స్‌లో ఏదైనా అత్యవసర శస్త్ర చికిత్స సమయంలో విద్యుత్ అంతరాయం కలిగితే ప్రాణాపాయ పరిస్థితులు ఉన్నాయి.

చీరాల డివిజన్ పరిధిలోని పర్చూరు, చీరాల పరిధిలో అన్ని కేటగిరీలు కలుపుకుని సుమారు 1,62000 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. దీంతో రోజుకు 1 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ వాడకం జరుగుతుంది. ఎండలు మండుతున్నా ఈ మధ్య కురిసిన వర్షాలు కారణంగా వాతావరణం అప్పుడప్పుడు చల్లబడింది. ఆ సమయంలో కొన్నిసార్లు విద్యుత్ డిమాండ్ తగ్గిందనే చెప్పాలి. అయినా కూడా చీరాల పట్టణంలోని సుమారు 10 వార్డులకు పైగా, వేటపాలెం, కొత్తపేట, చీరాల రూరల్ పరిధిలో ఈపూరుపాలెం, తోటవారిపాలెం, కావూరివారి పాలెం, వాడరేవు, దేవినూతల, బుర్లవారి పాలెం, ప ర్చూరు పరిధిలో పర్చూరు, కారంచేడు, కేశవరప్పాడు వంటి ప్రాంతాలలో గం టల కొద్దీ రాత్రింబవళ్లు విద్యుత్ అప్రకటిత కోతలు విధిస్తున్నారు. ఈనేపథ్యం లో వాటి పైనే ఆధారపడి జీవించేవారి పరిస్థితి దయనీయంగా మారింది. ఈక్రమంలో చేనేత కార్మికులకు మగ్గం సాగడం లేదు. రైతులకు సాగునీరు అం దడం లేదు. అధికారులు సమస్యలు పట్టించుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బిల్లులు తగ్గేదేలే

సాధారణంగా విద్యుత్ అప్రకటిత కోతలు, అంతరాయం వలన వినియోగం తగ్గుతోంది. ఈ క్రమంలో బిల్లులు తక్కువగా రావాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. వినియోగ ధరలు కంటే అదనపు సుంకాలే మోత మోగుతున్నాయి. విద్యుత్ కొనుగోలు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ), ట్రూ అప్ పేరుతో యూనిట్‌కు అదనంగా 21 పైసల నుంచి గరిష్ఠంగా 45 పైసలు వరకు వసూలు చేస్తున్నారు. ఈవిధంగా చూసుకుంటే విద్యుత్ ఆదాయం దండిగానే ఉంది. అయినా సరఫరా మెరుగు పరచక పోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తుండమే కాకుండా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోతలు ఉండవు..సరఫరా సక్రమంగా అందిస్తాం

ఇకపై విద్యుత్ కోతలు ఉండవు. ఎక్కడా కూడా కోతలు అమలు చేయడం లేదు. వర్షాలు, గాలులు సమయంలో సాంకేతిక లోపం సహజం. వాటిని వెం టనే పరిష్కరిస్తున్నాము. వ్యవసాయ విద్యుత్ సరఫరాలకు అంతరాయాలు లేవు. ఈ మధ్య కాలంలో కొన్నిచోట్ల విద్యుత్‌కు అంతరాయం జరిగింది. ఆ సమస్యను కూడా పరిష్కరించాం. వినియోగదారులకు ఇబ్బందులు ఉండవు. కాల పరిమితి ముగిసిన సర్వీసు వైర్లతో ప్రమాదం. అలాగే తడిచిన విద్యుత్ మోటార్లకు దూరంగా ఉండాలి.

- థామస్, చీరాల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



కొండయ్యను సత్కరిస్తున్న పుర ప్రముఖులు

ఘనంగా ఆర్‌కే టౌన్‌షిప్ ఆవిర్భావ వేడుకలు

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యను సత్కరించిన ప్రముఖులు

చీరాల, జూన్ 3 : టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆర్‌కే టౌన్‌షిప్ 33వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌కే టౌన్‌షిప్, ఆర్‌కే గ్రూపు కళాశాలల నిర్వాహకులు, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య మాట్లాడుతూ తనకు వెన్నంటి ఉండి అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న బంధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, స్థానికంగా కూటమి శ్రేణులకు శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పురప్రముఖులు, కొండయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం.రాజా, అవ్వారు సాంబయ్య, పృధ్వీ వెంకటేశ్వర్లు, తేలప్రోలు నాగేశ్వరరావు, బోయిన శివరామకృష్ణ, సిద్ధి బుచ్చేశ్వరరావు, పొత్తూరు సుబ్బయ్య, పృధ్వీ లలితమోహన్, జి.రాంబాబు, బొగ్గుల పార్థసారధి గుర్రం తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకుతో ఊపిరితిత్తులకు ప్రమాదం



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి

చీరాలటౌన్, మే 3 : పొగాకు వాడకం వలన గుండె, ఊపిరితిత్తులకు ప్రమాదం అని, పక్షవాతం, నోటి కేన్సర్ తదితర వ్యాధులు వస్తాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుభాషిణి అన్నారు. సోమవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా చీరాల ఏరియా ఆసుపత్రిలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పొగాకు పరిశ్రమల జోక్యం నుం చి పిల్లలను రక్షించాలని, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక కార్యచరణ ప్రకటించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎవరు స్మోకింగ్ చేయకూడదని, అలా చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రతి విద్యాసంస్థను పొగాకు రహిత విద్యాసంస్థలగా ప్రకటించడం, గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని రూపుమాపే దిశగా పలు అ వగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిగిరెట్, పోగాకు ఉత్పత్తుల చట్టం-2003 కఠినంగా అమలు పర్చడం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ హరిబాబు, వైద్యాధికారులు శ్రీకాంత్, పృధ్వీ, రవిప్రకాష్, దినేష్, లక్ష్మీనారాయణ, కోటినాగిరెడ్డి, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి బీ రమేష్, నర్సింగ్ స్టాఫ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగం

- రోడ్డు మార్జిన్‌లే డంపింగ్ కేంద్రాలు
- కంపుతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



నాగులపాలెంలో ముళ్లచెట్లతో ఉన్న చెత్త సంపద కేంద్రం

పర్చూరు, జూన్ 3 : మెరుగైన పారిశుధ్య నిర్వహణతోపాటు చెత్త నుంచి సంపదను సృష్టించాలన్న సంకల్పంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో లక్షల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు (డంపింగ్‌యార్డ్) నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లోని చెత్త చెదారాలను ఆయా పంచాయతీల ద్వారా పారిశుధ్య కార్మికులు సేకరించి వాహనాల ద్వారా రోడ్డు మార్జిన్‌లో వదలి వేస్తూ మమ అనిపిస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్ల మార్జిన్‌లు డంపింగ్ యార్డ్‌లను తలపించే విధంగా తయారయ్యాయి. దీంతో ఆ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలిసన వాహనదారులు కంపుతో ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు రోడ్డు మార్జిన్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తగులపెట్టేందుకు చర్యలు చేపట్టడంతో సమస్య తీవ్రంగా మారుతుంది. వ్యర్థాలను తగులపెట్టే క్రమంలో వెలువెడే పొగతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనాలకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పర్చూరు నుంచి చీరాల, పర్చూరు నుంచి ఇంకొల్లు, యద్దనపూడి వెళ్లే ప్రధాన రహదారుల్లో



పర్చూరు - యద్దనపూడి రహదారిలో వ్యర్థాలు

పరిస్థితి మరింత దయనీయంగా మారింది. లక్షలు వెచ్చిం‌ది నిర్మాణం చేసిన చెత్త సంపద కేంద్రాలు ముళ్ల చెట్లు, పొదలతో నిరుపయోగంగా మారాయి. కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తోసుకు వచ్చే డంపిగ్ కేంద్రాలు ఇలా అలనా పాలనకు నోచుకోక పోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన పర్చూరులో మాత్రం డంపింగ్ యార్డ్‌ను తాటాకుల షెడ్‌తో సరిపెట్టి మమా అనిపించారే తప్ప పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టలేదు. అడుసుమల్లి, నాగులపాలెం, నూతలపాడు, చెరుకూరు, రమణాయపాలెం తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను నిర్మాణం చేసారే తప్ప వినియోగంలోకి తీసుకు వచ్చిన దాఖలాలు లేవు. దీంతో ఏళ్ల తరబడి నిర్మాణం చేసిన డంపిగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయితీలకు ఆదాయం సమకూర్చడంతోపాటు, ప్రజలకు మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హుండీ కానుకల లెక్కింపు

సింగరాయకొండ, జూన్ 3 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. మూడు నెలలకు రూ.2,15,224 ఆదాయం సమకూరింది. అనంతరం ఈనెల 16వ తేదీ నుంచి 26 వరకూ జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో టెంకాయలు అమ్ముకోవడానికి వేలంపాటను నిర్వహించారు. రూ.1.55 లక్షలకు పేరం సుబ్బరామిరెడ్డి టెంకాయలు అమ్ముకునే హక్కును దక్కించుకున్నారు. కూల్‌డ్రింక్స్ ఐస్‌క్రీమ్ అమ్ముకోవడానికి నిర్వహించిన వేలం పాటలో ఎవరూ పాల్గొనకపోవడంతో నిలిపేశారు.



మహేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన గొట్టిపాటి

అద్దంకి, జూన్ 3 : మండలంలోని గోపాలపురం మాజీ సర్పంచ్ యర్రా మహేష్ కిడ్నీ మార్పిడి చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోమవారం మహేష్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. టీడీపీ నేతలు కరి పరమేష్, యర్రా రాఘయ్య శ్రీనివాసరావు ఆయన వెంట ఉన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చీరాలటౌన్, మే 3 : ఇంటి పరిసర ప్రాంతాలల్లో నీటి నిల్వలు లేకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా చూడడం వలన తద్వారా వచ్చే వ్యాధులకు ప్రజలు దూరంగా ఉండవచ్చని వైద్యాధికారులు శిరిషా, ప్రణయ్‌కుమార్ అన్నారు. సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా చీరాల పట్టణంలోని మరియంపేట, వైకుంఠపురం పట్టణ ఆ రోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా అ వగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యధికారులు మాట్లాడుతూ రాబోయే రోజులలో వర్షాల వలన మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ఎక్కువగా వస్తాయని, వాటి నుంచి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో చీరాల పట్టణ మలేరియా అధికారి చింతా శేషుబాబు, సూపర్‌వైజర్ బీబెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, పట్టణ ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.

పాఠశాలలోకి వర్షం నీరు



స్వర్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారీగా చేరిన వర్షపు నీరు

స్వర్ణ(పర్చూరు), జూన్ 3 : ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోకి భారీగా నీరు చేరింది. గ్రామంలోని ప్రధాన కాలనీలోకి నీరు చేరడంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతోపాటు గాలి దుమారం కూడా తోడు కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీటితో కలసి మురుగు నీరు రోడ్డుపై చేరడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

దుకాణాలను మూసి వేయించిన పోలీసులు



దుకాణాలను మూసి వేయిస్తున్న సీఐ నరసింహారావు, ఎస్ఐ

బల్లికురవ. జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాలలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు హెచ్చరించారు. సోమవారం రాత్రి బల్లికురవ మండల కేంద్రంలో దుకాణాలను సీఐ మూసివేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతు గ్రామాలలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు చెప్పారు. ఎవరూ ఇళ్ల నుంచి నుంచి బయటకు రావద్దని, ఒక చోట గుంపులుగా ఉండవద్దని సూచించారు. అత్యవసరమైతేనే ప్రయాణం చేయాలన్నారు. కౌంటింగ్ అనంతరం రాజకీయ పార్టీలకు మద్దతుగా వీధుల్లో వచ్చి కేకలు, ఈలలు వేయడం, బాణసంచా కాల్చడం చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆయనతోపాటు ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి, రైటర్ అంజనేయులు ఉన్నారు.

మొదలైన కౌంటింగ్ టెన్షన్


- నాడు అన్ని మండలాల్లోనూ టీడీపీకి మెజార్టీ
- అప్పటి, ఇప్పటి ఎన్నికల సరళిపై అంచనాలు



కౌంటింగ్ కోసం సిద్ధం చేసిన టేబుళ్లు

అద్దంకి, జూన్ 3 : గత సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ గాలి వీచినా అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాలలోనూ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆధిక్యతను సాధించారు. అత్యధికంగా పంగులూరు మండలంలో 3,330 ఓట్ల మెజార్టీ రాగా, అత్యల్పంగా బల్లికురవ మండలంలో 589 మెజార్టీ వచ్చింది. 2019 ఎన్నికలలో మండలాలవారీగా పరిశీలిస్తే సంతమాగులూరు మండలంలో 13 గ్రామాలలో టీడీపీకి, 7 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. సంతమాగులూరు మండలం మొత్తం పరిగణలోకి తీసుకుంటే టీడీపీకి 2611 ఓట్ల మెజార్టీ వచ్చింది. బల్లికురవ మండలంలో 13 గ్రామాలలో టీడీపీకి, 9 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. బల్లికురవ మండలం మొత్తమ్మీద టీడీపీకి 589 ఓట్లు మెజార్టీ వచ్చింది. అద్దంకి రూరల్ మండలంలో 16 గ్రామాలలో టీడీపీకి, 11 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. అద్దంకి రూరల్ మండలం మొత్తమ్మీద టీడీపీకి 2330 ఓట్లు మెజార్టీ వచ్చింది. అద్దంకి పట్టణంలో 1053 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. పంగులూరు మండలంలో 16 గ్రామాలలో టీడీపీకి, 5 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. పంగులూరు మండలం మొత్తమ్మీద 3,330 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. కొరిశపాడు మండలంలో 12 గ్రామాలలో టీడీపీకి, మూడు గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. కొరిశపాడు మండలం మొత్తమ్మీద 2788 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. పోస్టల్ ఓట్లలో కూడా టీడీపీకి మెజార్టీ వచ్చింది. నియోజకవర్గం మొత్తమ్మీద 12,747 ఓట్లు టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ మెజార్టీ సాధించారు. అప్పటి మండలాల మెజార్టీ ఆధారంగా ప్రస్తుతం ఆయా గ్రామాలలో జరిగిన ఓటింగ్ సరళిని బట్టి ఇరు పార్టీల నేతలు మెజార్టీలపై లెక్కలు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే టీడీపీకి 12 నుంచి 15 వేల వరకు మెజార్టీపై, అన్ని మండలాలలో టీడీపీ మెజార్టీ సాధిస్తుందని బెట్టింగ్‌లు పెద్ద ఎత్తున సాగాయి. మంగళవారం మధ్యాహ్నానికి దాదాపుగా ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉండడంతో బెట్టింగ్ రాయుళ్లలో టెన్షన్ మొదలైంది.

భారీ వర్షానికి ఉప్పుమడులు మునక





ఉప్పు కొఠారులలో నిలిచిన వర్షపు నీరు.. వర్షానికి కరిగిన ఉప్పు కువ్వలు

లబోదిబోమంటున్న రైతులు

చినగంజాం, జూన్ 3 : చినగంజాం మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో సాగు చేస్తున్న ఉప్పు మడులు నీట మునిగాయి. ఏప్రిల్, మేలో అధికంగా ఎండలు ఉండడంతో ఉప్పు దిగుబడి అధికంగా వస్తుంది. ఉప్పు దిగుబడి బాగా వచ్చే మేలో రెండు పర్యాయాలు అకాల వర్షాలు కురవడంతో ఉప్పు ఈ ఏడాది సక్రమంగా రాలేదు. ఉప్పు రైతులు ఉప్పు పంటకు వర్షం వలన విఘాతం కలిగిందని ఆవేదన చెందుతున్నారు. ఉప్పు నిల్వలు కూడా సక్రమంగా లేనప్పటికీ ధరలు అంతంత మాత్రంగానే ఉండడంలో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటిలో ఉప్పు వచ్చే అవకాశం లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. జూన్‌లో రుతుపవనాలు రావడంతో ఇకనుంచి చెదురుమదురు వర్షాలు కురుస్తూనే ఉంటాయని, దానివల్ల ఉప్పు కొఠారులు సాగు చేయడం కష్టమేనని రైతులు అంటున్నారు. మండల పరిధిలోని ఆడవీధిపాలెం, సోపిరాల, చినగంజాం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, పెదగంజాం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు భూములలో సుమారు మూడువేల ఎకరాలలో ఉప్పు పంటను రైతులు సాగు చేస్తున్నారు. తాజాగా కురిసిన వర్షానికి సుమారు రెండువేల ఎకరాలలో తీత తీయాల్సిన ఉప్పు, ఎక్కాలపై ఉంచిన ఉప్పు కరిగిపోయిందని రైతులు విలపిస్తున్నారు. గట్లపై నిల్వ ఉంచిన ఉప్పు కువ్వలు కూడా కరిగిపోయాయని రైతులు తెలిపారు. ఎకరం భూమిలో తీత తీయవలసిన 25 బస్తాల ఉప్పు వర్షానికి పోయిందని తెలిపారు. ప్రస్తుతం క్వింటా ఉప్పు బస్తా ధర నాణ్యతను బట్టి రూ.250 నుంచి రూ.300 వరకు ఉంది. నష్టాలలో ఉన్న ఉప్పు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ రమేష్

పర్చూరు, జూన్ 3 : నిబంధనలు అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎస్.రమేష్ అన్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎన్నికల గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్ ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అమలు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక పోలీస్ నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యాపార దుకాణాలు సైతం సంపూర్ణంగా మూనివేయాలన్నారు. బాణ సంచా కాల్చటం, వీధల వెంట సంబరాలు చేసుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చకొట్టే ప్రకటనలు చేయటం నిషేధమన్నారు. దీన్ని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు సహకరించాలన్నారు.

వైభవంగా ప్రథమ వార్షికోత్సవం

- 92 అడుగుల అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు
- వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి
- భారీగా తరలి వచ్చిన భక్తులు

పర్చూరు, జూన్ 3 : పర్చూరులోని వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సంలో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కిక్కిరిసింది. నియోజకవర్గ కేంద్రంలో రూ.2కోట్ల నిధులతో దాతల సహకారంతో శ్రీ అభయాంజనేయస్వామివారి సుందర విగ్రహం రూపుదిద్దుకుంది. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విగ్రహ దాత చిమటా శ్రీనివాసరావు దంపతులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది.



ఏలూరిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ



92 అడుగుల శ్రీ అభయాంజనేయ విగ్రహం

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి

శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ పూజల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరిని ఘనంగా సన్మానించారు.